www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
18-01-2026
సంపుటి : 01 | సంచిక : 187 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD



## పట్టాలెక్కిన 'వందేభారత్ స్లీపర్'

**జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ**

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** భారత రైల్వే చరిత్రలో మరో నూతన అధ్యాయం మొదలైంది. దేశీ సాంకేతికతతో రూపొందించిన అత్యంత విలాసవంతమైన తొలి 'వందేభారత్ స్లీపర్' రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాలో జరిగిన ఘనమైన కార్యక్రమంలో ఆయన జెండా ఊపి ఈ రైలును పట్టాలెక్కించారు. ఈ రైలు పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా - అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ప్రయాణికులకు.. మిగతా2లో...

ఆకట్టుకుంటున్న మేడారం
## కొత్త హంగులు

- గిరిజన కుంభమేళాకు వేళాయే!
- రూ. 150 కోట్లతో సర్కారు ఏర్పాట్లు
- భక్తులను కట్టిపడేస్తున్న కళాకృతులు

2



## చదువే తలరాతను మారుస్తుంది

- జడ్చర్లలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు భూమిపూజ
- 75 ఏళ్ల తర్వాత జిల్లాకు దక్కిన సీఎం అవకాశం
- మహబూబ్‌నగర్‌లో రూ.1284 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరుకు అన్యాయం జరిగిందని రేవంత్ విమర్శ
- కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయిందని ఎద్దేవా
- జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ
- తమ ప్రభుత్వం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని వెల్లడి



2

## మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

**త్వరలోనే షెడ్యూల్**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. మొత్తం 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్ వివరాలను తుది రూపంలో సిద్ధం చేసింది. శనివారం సాయంత్రం నాటికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లకు సంబంధించిన రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికానుంది... మిగతా2లో...




పురుష నేతలకు
# మొండి చెయ్యి

**మహిళలకే జై కొట్టిన రేవంత్ సర్కార్**

- మేయర్ పీఠాల్లో వారికే రిజర్వేషన్లు
- 10 కార్పొరేషన్లలో ఏ ఒక్కటీ కేటాయించని ఎన్నికల కమిషన్
- గ్రేటర్ హైదరాబాద్ సైతం జనరల్ మహిళకే..
- అన్నీ ఆడవాళ్లకేనా
- రిజర్వేషన్లపై పెదవి విరుస్తున్న ఆశావహ లీడర్లు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ రిజర్వేషన్లను ప్రకటించింది. వార్డుల నుంచి చైర్మన్లు, మేయర్ల వరకు రిజర్వేషన్లను విడుదల చేసింది. అయితే ఈ రిజర్వేషన్లపై మహిళలు ఎగిరి గంతేస్తుండగా.. పురుషులు మాత్రం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలోని ఏ ఒక్క కార్పోరేషన్‌కు పురుషులకు రిజర్వేషన్ ప్రకటించకపోవడంపై పెదవి విరుస్తున్నారు. అన్నీ సీట్లు మహిళలకు, లేదా జనరల్ గా ప్రకటించడంతో తమకు ప్రాధాన్యత దక్కలేదని, తీరని అన్యాయం జరిగిందని.. మిగతా2లో...




ఎమ్మెల్యేగా
## పోటీ చేయను

- గత ఎన్నికల్లో నా కోసం రాహుల్ గాంధీ ప్రచారం చేశారు
- నన్ను సంగారెడ్డిలో మేధావులు, పెద్దలు ఓడించారు
- ఇది నా జీవితంలో మరిచిపోలేనిది
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు


2

## విధులకు వెళ్తూ ఇద్దరు టీచర్ల దుర్మరణం

- జాజిరెడ్డిగూడెం వద్ద ఘోర ప్రమాదం
- నలుగురు టీచర్లు ప్రయాణిస్తున్న కారును ఢీకొన్న గుర్తుతెలియని వాహనం


2

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య..!!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు ఆందోళనకరంగా మారుతున్నాయి. గత మూడు వారాల వ్యవధిలోనే పది మందికిపైగా హిందువులు హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ క్రమంలో మరో హృదయవిదారక ఘటన వెలుగులోకి వచ్చింది. తాజాగా రాజ్‌బరి జిల్లాలో ఒక హిందూ యువకుడు దారుణంగా హతమయ్యాడు. పెట్రోల్ బంక్‌లో ఇంధనం నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండా వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునేందుకు ప్రయత్నించాడన్న కారణంతో, అతడిని వాహనంతో ఢీకొట్టి చంపినట్లు.. మిగతా2లో...



## కార్పొరేషన్‌గా నల్లగొండ

- హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేస్తాం
- 25 నెలల్లోనే హోదా సాధించాం
- నిధుల వెల్లువకు మార్గం సుగమం
- సీఎంకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు


2


## లక్కీడ్రా మోసగాళ్లకు కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక

**విశ్వంభర, హైదరాబాద్ :** లక్కీడ్రాల పేరిట మోసగిస్తే ఊచలు లెక్కపెట్టాల్సిందేనని సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లకు సీపీ సజ్జనార్ హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌ల దందాలపై ఉక్కుపాదం మోపిన హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా సాగుతున్న.. మిగతా2లో...



## దావోస్‌కు చంద్రబాబు

- ప్రపంచ ఆర్థిక వేదికపై ఏపీ బ్రాండ్ ఇమేజ్!
- రూ.లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- నాలుగు రోజుల్లో 36 భేటీలు
- గూగుల్, ఐబీఎం సీఈవోలతో ప్రత్యేక సమావేశాలు


2

# చదువే తలరాతను మారుస్తుంది



**విశ్వంభర తెలంగాణ బ్యూరో:** "సమాజంలో ఏ సమస్యకైనా విద్యే సరైన పరిష్కారం చూపుతుంది. చదువు వల్లనే అవకాశాలు మెరుగుపడతాయి, భవిష్యత్ నిర్మించబడుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ మేరకు జడ్చర్ల మండలం చిట్టెబోయినపల్లిలో ఏర్పాటు చేయనున్న మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

రాజకీయ ప్రస్థానంపై స్ఫూర్తిదాయక ప్రసంగం

ముఖ్యమంత్రి తన రాజకీయ ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకుంటూ.. "నేను అచ్చంపేట నియోజకవర్గంలోని ఒక మారుమూల పల్లె నుంచి వచ్చాను. పట్టుదలతో కష్టపడి పనిచేయడం వల్లే రాజకీయాల్లోకి వచ్చిన 17 ఏళ్లలోనే ముఖ్యమంత్రిని కాగలిగాను. కనీసం మంత్రిగా కూడా పని చేయకుండానే మీ అందరి సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నాను" అని పేర్కొన్నారు. విద్యార్థులు భాషను మెరుగుపరుచుకోవాలని, తాజా పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

విద్యకు 'ప్రజా ప్రభుత్వం' అగ్రతాంబూలం

పూర్వం పేదలకు పంచడానికి భూములు ఉండేవి. కానీ ఇప్పుడు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి కూడా భూమి లేని పరిస్థితి నెలకొంది. అందుకే పేదరికం నుంచి బయట పడటానికి విద్య ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.

జిల్లాపై ప్రత్యేక మమకారం బూర్గుల రామకృష్ణారావు తర్వాత దాదాపు 75 ఏళ్లకు మహబూబ్‌నగర్ జిల్లాకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దక్కిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను విద్యా, ఇరిగేషన్ పరంగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. "ఈ ఏడాదిలోనే IIIT భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. నిబద్ధత లేని చదువు జీవితానికి ఉపయోగపడదు. సమాజంలో గౌరవం పెరగాలంటే విద్యతో పాటు తల్లిదండ్రులను గౌరవించే సంస్కారం ఉండాలి" అని ఆయన హితబోధ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన ఆయన, రూ.1,284 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా అందులో పాలమూరు బిడ్డల చెమట ఉంటుందని, కానీ ఈ జిల్లా మాత్రం వెనుకబడే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

2013లో కాంగ్రెస్ నేతలు సాధించుకున్న పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.23 కోట్లు చెల్లించారని, ఉద్ధండాపూర్ జలాశయం భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. సంగంబండ వద్ద బండను పగులగొట్టేందుకు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయిందని ఎద్దేవా చేశారు.

పాలమూరు జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు ఐఐఎం తెస్తే, భూమి ఇచ్చే బాధ్యత తనదని సీఎం స్పష్టం చేశారు.

# పురుష నేతలకు మొండి చెయ్యి

(మొదటి పేజీ తరువాయి)

పురుష లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదిట్లోనూ పంగనామాలే..

రాష్ట్రంలో పది మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. మొత్తం రిజర్వేషన్లలో ఎస్టీ జనరల్ కు ఒకటి, ఎస్సీ జనరల్ కు ఒక కార్పొరేషన్ కేటాయించారు. అలాగే బీసీలకు మూడు కార్పొరేషన్లను కేటాయించిన కమిషన్ ఇందులో రెండు బీసీ జనరల్ కు ఒక సీటును బీసీ మహిళకు కేటాయించింది. ఇక మిగిలిన ఐదు కార్పొరేషన్లలో నాలుగు కార్పొరేషన్లను జనరల్ మహిళకు కేటాయించిన కమిషన్.. ఒక కార్పొరేషన్ ను మాత్రమే జనరల్ కేటగిరీలో ఉంచింది. అంటే జనరల్ కు కేటాయించిన కార్పొరేషన్ను కచ్చితంగా పురుషులకు మాత్రమే కేటాయించాలన్న నిబంధన లేదు కాబట్టి మహిళకు కూడా కేటాయించే అవకాశం ఉన్నది. కొత్తగూడెం కార్పొరేషన్ ను ఎస్టీ జనరల్ కు కేటాయించింది కమిషన్. రామగుండం కార్పొరేషన్ ను ఎస్సీ జనరల్ కు కేటాయించింది. అంటే ఈరెండు కార్పొరేషన్లలో పురుషులు లేదా మహిళల్లో ఎవరైనా మేయర్ అవ్వచ్చు. ఇక మహబూబ్ నగర్ కార్పొరేషన్ ను బీసీ మహిళకు కేటాయించగా మంచిర్యాల, కరీంనగర్ కార్పొరేషన్లను బీసీ జనరల్ కు కేటాయించారు. వీటిని కూడా పురుషులు లేదా మహిళలకు కేటాయించవచ్చు.

గ్రేటర్ హైదరాబాద్ సైతం మహిళకే..

ఇక గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పోస్టును జనరల్ మహిళకు కేటాయించారు. జనరల్ మహిళ అంటే కులంతో సంబంధంలేకుండా ఏ మహిళకైనా పదవి దక్కవచ్చు. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ కార్పొరేషన్లను కూడా జనరల్ మహిళలకు కేటాయించింది కమిషన్. అయితే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ను మాత్రం జనరల్ కేటగిరిలో ఉంచింది. జనరల్ కేటగిరి అన్నంత మాత్రాన పురుషులకే కేటాయించాలని ఏమీలేదు. ఈ మేయర్ పోస్టులో మహిళ కూడా కూర్చోవచ్చు. వరంగల్ లో పురుషులు లేదా మహిళల్లో ఎవరు బలమైన నేతయితే వాళ్ళకే ఈ మేయర్ పోస్టు దక్కుతుంది అనటంలో సందేహంలేదు.

రేవంత్ సర్కార్‌పై అసహనం

తాజా రిజర్వేషన్లను గమనిస్తే రేవంత్ రెడ్డి ఏలుబడిలోని తెలంగాణలో పురుషులకు జరిగిన అన్యాయం అర్థమైపోతుంది. ఒక్కటంటే ఒక్క కార్పొరేషన్ ను కూడా పురుషులకు కేటాయించలేదు. ప్రత్యేకంగా నాలుగు మేయర్ పోస్టులను మహిళలకే కేటాయించిన కమిషన్ పురుషులకు మాత్రం తీరని అన్యాయం చేసింది. దీన్ని రాజకీయపార్టీల్లోని నేతలు ప్రత్యేకించి కాంగ్రెస్ నేతలు ఏ విధంగా చూస్తారన్నది ఆసక్తిగా మారింది.

# ఆకట్టుకుంటున్న మేడారం కొత్త హంగులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'సమ్మక్కసారలమ్మ' మహా జాతరకు మేడారం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. అడవి తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ మేడారం పరిసర ప్రాంతాలు సరికొత్త హంగులను అద్దుకున్నాయి. ములుగు నుంచి తాడ్వాయి మీదుగా మేడారం వరకు సాగే దారి పొడవునా పండుగ వాతావరణం నెలకొంది. జాతరను పురస్కరించుకుని ప్రభుత్వం చేపట్టిన సుందరీకరణ పనులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గిరిజన సంప్రదాయాలు, ఆదివాసీల జీవనశైలిని ప్రతిబింబించేలా ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ములుగు, తాడ్వాయ్ వంటి ప్రాంతాల్లోని ప్రధాన చౌరస్తాలను విద్యుత్ దీపాలు, రంగురంగుల పెయింటింగ్స్‌తో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.150 కోట్ల భారీ నిధులతో అభివృద్ధి పనులను పూర్తి చేసింది. రహదారుల విస్తరణ, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్య పనులతో పాటు పర్యాటక హంగులను కూడా జోడించారు.

సెల్ఫీల సందడి

జాతర ప్రాంగణానికి చేరుకుంటున్న భక్తులు అక్కడి సుందర దృశ్యాలను చూసి మురిసిపోతున్నారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు చేసిన కళాకృతుల వద్ద భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. వనదేవతల కొలువులో ఈసారి ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం కూడా తోడవ్వడంతో మేడారం సరికొత్త అందాలను సంతరించుకుంది.

# కార్పొరేషన్ గా నల్లగొండ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ ప్రజల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. కార్పొరేషన్ హోదా రావడంతో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ హోదాతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు పొందే అవకాశం లభించింది. కేవలం 25 నెలల్లోనే నల్లగొండకు ఈ హోదాను సాధించామని మంత్రి గుర్తు చేశారు.

రాజకీయాలకు అతీతంగా నల్లగొండను 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులను వెల్లడించారు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులు.. రూ.700 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు, ధర్వేశిపురం వరకు 6 లైన్ల రహదారి, బ్రహ్మంగారి గుట్ట – లతీఫ్ సాబ్ దర్గా గుట్టల సమగ్ర అభివృద్ధి చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. సాగునీరులో భాగంగా ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడమే లక్ష్యమని కోమటిరెడ్డి తెలిపారు. ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్ పనుల కోసం రూ.450 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తన సంకల్పమని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా నేతలందరూ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వ హయాంలో నల్లగొండ రూపురేఖలు మారిపోతాయని ఆయన స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యేగా పోటీ చేయను



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన రాజకీయ జీవితంలో ఇకపై సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంగా ప్రకటించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను వివరిస్తూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు.

జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీ తన కోసం సంగారెడ్డికి రావడం తనకు ఎంతో బాధ్యతగా అనిపించిందన్నారు. తనను గెలిపించాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ నియోజకవర్గంలో గట్టిగా ప్రచారం చేశారని, అంతటి ప్రచారం జరిగినప్పటికీ తాను ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి అవమానించినట్టుగా తనకు అనిపించిందని, అదే తన మనసును ఎక్కువగా బాధించిందన్నారు.

రాహుల్ గాంధీ తన భుజంపై చేయి వేసి ప్రజలను తనకు ఓటేయాలని కోరిన దృశ్యం తనకు ఎప్పటికీ మర్చిపోలేనిదని చెప్పారు. అటువంటి పరిస్థితిలో కూడా తాను ఓడిపోవడం తన జీవితంలో మరచిపోలేని అనుభవంగా మిగిలిందని అన్నారు. ఈ ఓటమికి కారణం పేద ప్రజలు కాదని, సంగారెడ్డిలోని కొందరు మేధావులు మరియు ప్రభావశీలులే తన ఓటమికి ప్రధాన కారణమని వ్యాఖ్యానించారు.

ఈ అనుభవం తర్వాత సంగారెడ్డి నియోజకవర్గంతో తనకు భావోద్వేగ విరామం అవసరమైందని జగ్గారెడ్డి అన్నారు. భవిష్యత్తులో తన భార్య నిర్మలా సంగారెడ్డిలో పోటీ చేసినా, తాను అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పార్టీ కోసం ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, సంగారెడ్డి విషయంలో మాత్రం తాను ఇక ముందుకు వెళ్లనని తేల్చిచెప్పారు. జగ్గారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోనూ, స్థానిక రాజకీయాల్లోనూ కొత్త చర్చకు దారితీశాయి.

# మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)


రిజర్వేషన్ జాబితాను శనివారం రాత్రికి లేదా ఆదివారం ఉదయం రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్. ఈ.సీ)అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం అధికారికంగా జీ.వో జారీ చేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధంగా ఉంది. ఒకటి నుంచి రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

రిజర్వేషన్ వివరాల ప్రకారం, 10 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎస్సీకి ఒకటి, ఎస్టీకి ఒకటి, బీసీకి మూడు స్థానాలు కేటాయించగా, వాటిలో ఒకటి బీసీ మహిళలకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఉన్న ఐదు కార్పొరేషన్లలో నాలుగు మహిళలకు కేటాయించడం విశేషంగా మారింది. ఇక 121 మున్సిపాలిటీల విషయానికి వస్తే, ఎస్సీకి 17, ఎస్టీకి 5, బీసీకి 38, జనరల్ కేటగిరీకి 61 మున్సిపాలిటీలను కేటాయించారు.

కార్పొరేషన్‌ల వారీగా చూస్తే.. కొత్తగూడెం కార్పొరేషన్ ఎస్టీ (జనరల్)కు, రామగుండం కార్పొరేషన్ ఎస్సీ (జనరల్)కు కేటాయించారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ బీసీ మహిళలకు, మంచిర్యాల మరియు కరీంనగర్ కార్పొరేషన్లు బీసీ (జనరల్) కు దక్కాయి. ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ కార్పొరేషన్లు జనరల్ మహిళలకు కేటాయించగా, వరంగల్ కార్పొరేషన్ జనరల్ కేటగిరీకి ఇచ్చారు. జీహెచ్ఎంసీ కూడా జనరల్ మహిళలకు కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రిజర్వేషన్ ప్రక్రియతో తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

# లక్కీడ్రా మోసగాళ్లకు కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)




'లక్కీడ్రా' మోసాలపై దృష్టి సారించారు. కారు ఇస్తాం.. బైక్ ఇస్తాం.. అంటూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ఇన్ ఫ్లూయెన్సర్లను ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన కొందరు సోషల్ మీడియా స్టార్లే, ఇప్పుడు రూటు మార్చి లక్కీడ్రాల పేరుతో కొత్త వేషాలు వేస్తున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాల్లో సాగుతున్న ఈ దగాను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

కార్లు, ఖరీదైన బైకులు, డీజే సిస్టమ్స్ బహుమతులుగా ఇస్తామంటూ ప్రచారం చేయడంపై వీసీ సజ్జనార్ మండిపడ్డారు. సామాన్య ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేయొద్దని తెలిపారు. సెలబ్రిటీలైనా, సోషల్‌మీడియా స్టార్లయినా సరే.. చట్టం ముందు అందరూ సమానులే అని వ్యాఖ్యానించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఇన్ ఫ్లూయెన్సర్లపై 'ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, 1978' కింద కేసులు నమోదు చేస్తామని సీపీ స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజల జేబులు కత్తిరిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. అమాయక ప్రజలు ఇలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సజ్జనార్ హెచ్చరించారు. ఎవరైనా ఇటువంటి డ్రాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు.

# బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య..!!

(మొదటి పేజీ తరువాయి)



పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు.

రిపోన్ సాహా రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం అక్కడికి వచ్చిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ తన కారులో పెట్రోల్ నింపించుకున్నాడు. అనంతరం డబ్బులు చెల్లించకుండా అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీనిని గమనించిన రిపోన్ అతడిని ఆపేందుకు ముందుకు వెళ్లగా, హాషేమ్ తన కారును అతనిపైకి నడిపించాడు. ఈ ఢీకొనడంతో రిపోన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఘటనకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని, అబుల్ హాషేమ్‌తో పాటు అతని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# పట్టాలెక్కిన 'వందేభారత్ స్లీపర్'

(మొదటి పేజీ తరువాయి)



సేవలు అందించనుంది.


విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని రైలును ప్రారంభించడానికి ముందు ప్రధాని మోదీ స్వయంగా కోచ్‌లలోకి వెళ్లి పరిశీలించారు. అందులోని అత్యాధునిక సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్లో ఉన్న విద్యార్థులతో ప్రధాని సరదాగా ముచ్చటించారు. విమాన ప్రయాణానికి మించిన సౌకర్యాలు ఈ రైల్లో ఉన్నాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

గంటకు 180 కి.మీ. వేగం వందేభారత్ స్లీపర్ రైలు రికార్డు స్థాయి వేగాన్ని సాధించింది. రాజస్థాన్‌లోని కోటా నుంచి మధ్యప్రదేశ్‌లోని నాగ్దా మధ్య నిర్వహించిన తుది పరీక్షల్లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకుంది. రైలు ఇంత వేగంతో వెళ్తున్నా ప్రయాణికులకు కుదుపులు తెలియకుండా ఉండేలా అధునాతన సస్పెన్షన్ వ్యవస్థను రూపొందించారు. గతంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పంచుకున్న వీడియోలో.. గరిష్ఠ వేగం వద్ద కూడా నీటి గ్లాసులోని నీళ్లు ఏమాత్రం తొణకకపోవడం ఈ రైలు స్థిరత్వానికి నిదర్శనంగా నిలిచింది.

విమాన తరహా సౌకర్యాలు..

మొత్తం 16 కోచ్‌లతో సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా కనీస ఛార్జీని రూ.960గా నిర్ణయించారు. ఆకర్షణీయమైన ఏసీ బెర్తులు, మెరుగైన కుషనింగ్, నిప్పును గుర్తించే ఫైర్ డిటెక్షన్ సిస్టమ్, సీసీటీవీ నిఘా, ఆటోమేటిక్ తలుపులు వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఈ రైల్లో ఆర్ఏసీ (RAC) లేదా వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులను అనుమతించరు. కన్ఫర్మ్ టికెట్ ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. సుదూర ప్రాంతాలకు వేగంగా, సౌకర్యవంతంగా చేరుకోవాలనుకునే ప్రయాణికులకు ఈ వందేభారత్ స్లీపర్ ఒక గొప్ప ప్రత్యామ్నాయంగా మారనుంది.

# విధులకు వెళ్తూ ఇద్దరు టీచర్ల దుర్మరణం



**విశ్వంభర, క్రైం న్యూస్:** సంక్రాంతి సెలవులు ముగించుకుని, కొత్త ఉత్సాహంతో బడిబాట పట్టిన ఆ ఉపాధ్యాయులను విధి వంచించింది. పాఠశాల గడప తొక్కకముందే మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వారిని కబళించింది. నల్లగొండ జిల్లా కేంద్రం నుండి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి విధులకు హాజరయ్యేందుకు వస్తున్న నలుగురు ప్రధానోపాధ్యాయుల కారు జాజిరెడ్డిగూడెం (అర్వపల్లి) వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందగా, మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

శనివారం ఉదయం నల్లగొండ నుంచి తుంగతుర్తి మండలానికి టీచర్లు తమ కారులో బయలుదేరారు. జాజిరెడ్డిగూడెం సమీపంలోకి రాగానే ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద తీవ్రతకు తుంగతుర్తి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మామిడాల కల్పన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రావులపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు గీతారెడ్డి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి గాయాలు

ఈ ప్రమాదంలో తుంగతుర్తి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అల్వాల ప్రవీణ్ కుమార్, అన్నారం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అల్వాల సునీత తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరూ స్వయానా అక్కాతమ్ముడు. ప్రస్తుతం వీరు సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకే ప్రమాదంలో అక్కాతమ్ముడు గాయపడటంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరణించిన గీతారెడ్డి, తుంగతుర్తి ఆర్ఐ రవీందర్ రెడ్డికి దగ్గరి బంధువు అని తెలిసింది.

కన్నీరు మున్నీరవుతున్న విద్యార్థులు

సెలవుల తర్వాత తమ పాఠశాలకు వస్తున్న సార్లకు ప్రమాదం జరిగిందని తెలియగానే విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వారం రోజుల క్రితం తమతో కలిసి నవ్వుతూ గడిపిన వారు ఇప్పుడు లేరన్న వార్తను జీర్ణించుకోలేకపోతున్నారు. తుంగతుర్తి మండలంలోని నాలుగు పాఠశాలల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**అధికారుల పరామర్శ..**

ఈ విషయం తెలియగానే జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సెక్టోరియల్ అధికారులు రాంబాబు, శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దావోస్‌కు చంద్రబాబు



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో భారీ విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం'2026 వార్షిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల బృందం ఆదివారం బయలుదేరి వెళ్లనుంది. పారిశ్రామిక దిగ్గజాలను కలిసేందుకు, రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు అత్యంత కట్టుదిట్టమైన ప్రణాళికతో సిద్ధమయ్యారు.

సదస్సులో బాబులోకేష్ జోరు

ఈ అంతర్జాతీయ వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు మొత్తం మూడు కీలక సెషన్లలో ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా 'ట్రిలియన్ డాలర్ల ఏఐ ఎకానమీ' మరియు 'పునరుత్పాదక ఆహార వ్యవస్థలు' అనే అంశాలపై ఆయన ప్రసంగం సాగనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెండు సెషన్లలో ప్రసంగించనున్నారు. 'పీ4' (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) మోడల్, రాష్ట్రంలో సాగుతున్న డిజిటల్ విప్లవం గురించి వివరించనున్నారు.

నాలుగు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రి దాదాపు 36 కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, ఏపీ మోలర్ మేర్స్క్ సీఈవో విన్సెంట్ క్లెర్క్‌లతో సీఎం ప్రత్యేకంగా సమావేశమై ఏపీలో వారి పెట్టుబడుల విస్తరణపై చర్చించనున్నారు. స్విట్జర్లాండ్ ఆర్థిక మంత్రి, యూఏఈ వాణిజ్య ప్రతినిధులు, ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిరన్ బర్కత్ వంటి కీలక నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. దావోస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏపీ లాంజ్ వేదికగా 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' వంటి వినూత్న కార్యక్రమాలపై అంతర్జాతీయ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు. ఈ పర్యటన ద్వారా ప్రధానంగా మూడు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ నెల 19 నుంచి 22 వరకు అత్యంత బిజీగా గడపనున్న సీఎం బృందం, 23న పర్యటన ముగించుకుని నేరుగా అమరావతికి చేరుకుంటుంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి కనీసం రూ.50 వేల నుంచి రూ.1 లక్ష కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# దీదీని సాగనంపుదాం : ప్రధాని మోదీ




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** పశ్చిమ బెంగాల్ ప్రజల కష్టాల పట్ల ఏమాత్రం స్పందన లేని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇక వెళ్లిపోవాల్సిన సమయం వచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పును కోరుకుంటున్నారని, ముఖ్యంగా యువతరం బీజేపీ అభివృద్ధి నమూనాపై నమ్మకం పెట్టుకుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.
బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సభకు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. రాష్ట్రంలో వ్యాపిస్తున్న అవినీతి కారణంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పేదలకు చేరడం లేదని మోదీ ఆరోపించారు. పేదలకు ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర పథకాల లబ్ధి అందాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. కానీ పేదల కోసం పంపిన నిధులను టీఎంసీ నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. టీఎంసీ ప్రభుత్వం తనకు మాత్రమే కాదు, బెంగాల్ ప్రజలకే శత్రువుగా మారిందని ఆయన విమర్శించారు.
బెంగాల్ అభివృద్ధితోనే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే లక్ష్యం సాకారమవుతుందని ప్రధాని స్పష్టం చేశారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ వరుస విజయాలను గుర్తుచేస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో కూడా సుపరిపాలనకు మార్గం తెరవాల్సిన సమయం వచ్చిందన్నారు. మహారాష్ట్రలో, ముఖ్యంగా ముంబై పురపోరులో బీజేపీ సాధించిన చారిత్రక విజయాన్ని ప్రస్తావించారు. ఈసారి బెంగాల్‌లో మార్పు అవసరమని తాను చెబుతానని, అదే మాటను ప్రజలంతా గొంతెత్తి చెప్పాలని సభికులను మోదీ ఉత్సాహపరిచారు.
కేంద్ర ప్రభుత్వ పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయుష్మాన్ భారత్ వంటి కీలక పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, దీనివల్ల పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇలాంటి అమానవీయ ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాల్దాలో పరిశ్రమలు లేకపోవడంతో అక్కడి ప్రజలు, అలాగే ముర్షీదాబాద్ వాసులు ఉద్యోగాల కోసం వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం, వరదల సమయంలో సరైన సహాయం లేక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.
గంగా, ఫులాహార్ నదుల తీరాల్లో జరుగుతున్న భూక్షయం వల్ల వేలాది కుటుంబాలు ఇళ్లు కోల్పోయినా, రక్షణ గోడల కోసం ప్రజలు చేస్తున్న విజ్ఞప్తులను టీఎంసీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మోదీ ఆరోపించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు కూడా లబ్ధిదారులకు చేరలేదని కాగ్ నివేదికలు స్పష్టంగా చెబుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎంసీ అనుచిత విధానాలకు ముగింపు పలికి, వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అలాగే మాల్దా ప్రాంతంలోని మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు కల్పించి, వారి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రధాని స్పష్టం చేశారు.



## జంధ్యాల జయంతి సందర్భంగా హాస్య వేడుకలు

**విశ్వంభర, చిక్కడపల్లి :** హైదరాబాదు హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో అశోక్ నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సినీ దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా హాస్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎల్ఎస్ఆర్ మూర్తి, మోహన కృష్ణ, శరత్ చంద్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధుసూదన రావు, యువకళా వాహిని లంకా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. పలువురు కళాకారులు హాస్య స్కిట్లు ప్రదర్శించగా, లక్ష్మీ వైష్ణవి, ప్రజ్ఞ సంప్రదాయ నృత్యం చేశారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న కళాకారులకు ముమెంటోలు అందజేశారు.

## పది నిమిషాల వ్యవధిలోనే రెండు బంగారు గొలుసు దొంగతనాలు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** పది నిమిషాల వ్యవధిలోనే రెండు బంగారు గొలుసు దొంగతనాలు జరిగిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్కే పురం రోడ్ నెంబర్ 2 లో నివాసం ఉండే ఆదిలక్ష్మి (40) గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఉదయం 10 గంటల 21 నిమిషాల సమయంలో ఇద్దరూ గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి దాదాపు 1.5 తుల బంగారం గొలుసు తెంపుకుని పోయినారు.
మరో సంఘటనలో...
న్యూ మారుతి నగర్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉదయం 10:31 నిమిషాలకు పద్మ(72) ను వెనకాల నుండి వెళ్ళి గొలుసు తెంపే ప్రయత్నం చేయగా ఆమె అరవగా పారిపోయినారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.. నాగోల్, ఎల్బీనగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్లకు సంబంధించిన సిబ్బందిని పలు టీములుగా ఏర్పాటు చేసి నేరస్తులను పట్టుకొనుటకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.


## అసలు యుద్ధం ఇప్పుడే ప్రారంభమైంది

**- ఉద్ధవ్ థాకరే**



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ తమను రాజకీయంగా నిర్వీర్యం చేశామని భావిస్తే అది వారి భ్రమ మాత్రమేనని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. ఇది ముగింపు కాదని, అసలు పోరాటం ఇప్పుడే ప్రారంభమైందని ఆయన గట్టిగా హెచ్చరించారు. బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ కుట్రలు, అవకతవకలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకొస్తామని ఉద్ధవ్ థాకరే ప్రకటించారు.
ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలన్నదే తన కల అని, ఆ కల నెరవేరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన భావోద్వేగంగా తెలిపారు. ముంబై ప్రజల హక్కులను కాపాడటమే తన లక్ష్యమని, ఆ నగరాన్ని పూర్తిగా తాకట్టు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్థానిక ఎన్నికల్లో జరిగిన అక్రమాల వల్లే బీజేపీ విజయం సాధించిందని ఆయన ఆరోపించారు. కుట్రపూరితంగా, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ఆ పార్టీ ముందుకు వెళ్లిందని మండిపడ్డారు.
ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఉద్ధవ్ థాకరే, తమ పార్టీకి ప్రజల నుంచి బలమైన మద్దతు లభించిందని చెప్పారు. మొత్తం 227 స్థానాలు ఉన్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో శివసేన (యూబీటీ) 64 స్థానాలు గెలుచుకోవడం చిన్న విషయం కాదని పేర్కొన్నారు. బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) వర్గం 27 స్థానాలు సాధించినప్పటికీ, ప్రజల మనసులు తమవైపేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
మహారాష్ట్ర రాజకీయాల్లో నిజమైన పోరాటం ఇంకా ముందుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు శివసేన (యూబీటీ) వెనకడుగు వేయదని ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. ముంబై భవిష్యత్తు కోసం, ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత



**విశ్వంభర, మేడ్చల్ :** జిహెచ్ఎంసీలో కొత్తగా విలీనమైనటువంటి మున్సిపాలిటీలో ఘట్కేసర్ ఒకటి అందులో భాగంగా ఎదులాబాద్ 7 వార్డుగా ఏర్పడింది. త్వరలో జరగనున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎదులాబాద్ నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని ఎన్నికపై కసరత్తు మొదలైంది. ఈసారి ఎన్నికల్లో యువకులకే అవకాశం ఇచ్చే ఆలోచన ఉన్నట్టు వినికిడి. భారతీయ జనతా పార్టీకి చెందిన అభ్యర్థి యువతకు ఆదర్శంగా ఉంటూ, రాజకీయంలో చురుగ్గా పనిచేసే వ్యక్తికే ఈసారి అవకాశం ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ యోచిస్తుంది. ఆ ప్రాంతం నుండి భారతీయ జనతా యువమోర్చా జిల్లా సెక్రెటరీ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేరు ప్రకటించేలా ఊహాగానాలు చెక్కర్లు కొడుతున్నాయి.. తన పదో తరగతి నుండి గత 8ఏండ్లు ఏబీవీపీ లో చురుగ్గా పనిచేస్తూ తన వంతు ప్రయత్నం గా ఎంతో మంది విద్యార్థులకు అన్ని విషయాల్లో ముందుండి నిలిచిన విద్యార్థి నాయకుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి. ఒక్క ఏబీవీపీలో కాక బజరంగ్దళ్ గో రక్ష ప్రముఖ మండల గ్రామ అధ్యక్షుడిగా ఎన్నెన్నో కేసులకు వెనకడుగు వేయకుండా తనవంతు ప్రయత్నంగా నిలుస్తూ, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో కీలక యువ నాయకుడుగా యువతను ముందడుగు వేసే ప్రయత్నంగా ముందుండి నడుపుతున్నాడు. అలాంటి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని గుర్తించి ఈసారి ఎదులబాద్ కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చే యోచనలో ఉన్నట్లు స్థానికంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చూద్దాం ఏం జరుగుతదో..



కాంగ్రెస్ నాయకులు తిప్పర్తి విజయభాస్కర్ రెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకోని అల్మాస్ గూడ సమీపంలోని వారి నివాసంలో కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్.

(విశ్వంభర, ఎల్బీనగర్)

## వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం

- వివాహ ప్రోత్సాహక నగదు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు
- దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి.

**విశ్వంభర, హైదరాబాద్ :** వికలాంగుల జీవన భద్రత, సామాజిక గౌరవం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల మధ్య జరిగే వివాహాలకు అందజేస్తున్న వివాహ ప్రోత్సాహక నగదును రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు మహిళలు, పిల్లలు, వికలాంగులు & సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ ద్వారా జీ.ఓ .ఎంఎస్ .నంబర్ .1, 17012026 ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఆర్థిక సహాయం భార్య పేరున నేరుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.
ఈ నిర్ణయంతో వికలాంగ దంపతులకు వివాహానంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు తగ్గడంతో పాటు, నివాసం, వైద్య ఖర్చులు, జీవనోపాధి ఏర్పాట్లకు గణనీయమైన సహాయం అందనుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న వికలాంగ దంపతులు గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఈ నగదు ప్రోత్సాహకం కీలకంగా మారనుంది.



దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ...
వికలాంగుల జీవితాల్లో భద్రత, స్థిరత్వం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వాల కాలంలో కేవలం పరిమిత సహాయం మాత్రమే అందిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.
వికలాంగుల మధ్య వివాహాలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక అంగీకారం పెరుగుతుందని, వివక్ష తగ్గుతుందని, అలాగే కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా వికలాంగుల ఆత్మవిశ్వాసం పెరిగి, సమాజంలో వారు సమాన హక్కులతో జీవించేందుకు మార్గం సుగమమవుతుందని అన్నారు.
సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల కోసం పింఛన్ల పెంపు, సంక్షేమ పథకాల విస్తరణ, ఆర్థిక సహాయాల పెంపు వంటి చర్యలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. మాటల్లో కాకుండా, కార్యాచరణలో వికలాంగుల పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఈ నిర్ణయం స్పష్టంగా చూపుతోందన్నారు.
ఈ ఉత్తర్వుల అమలుకు సంబంధించి వికలాంగులు, సీనియర్ సిటిజన్లు & ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ డైరెక్టర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.
వికలాంగుల గౌరవం, హక్కులు, భవిష్యత్ భద్రత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయం మరోసారి రుజువు చేస్తోందని అధికారులు తెలిపారు.

## బహుజన రాజ్యాధికారమే తెలంగాణ రాజకీయ కూటమి ప్రధాన లక్ష్యం : దిలీప్ కుమార్



**విశ్వంభర, హైదరాబాదు :** బహుజన రాజ్యాధికారమే తెలంగాణ రాజకీయ కూటమి ప్రధాన లక్ష్యమని కూటమి ప్రధాన కార్యదర్శి కపిలవాయి దిలీప్ కుమార్. స్పష్టం చేశారు. శనివారం కవాడిగూడలోని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ కార్యాలయంలో తెలంగాణ రాజకీయ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కూటమితో కలసి వచ్చిన వివిధ పార్టీల నేతలతో కలసి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం మాదిరిగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఘోరంగా విఫలమయిందని, వాటికి ప్రత్యామ్నాయంగా ఏర్పడించే రాజకీయ కూటమి అని తెలిపాడు. ఎన్నో ఉద్యమాలు. పోరాటాలతో, ఎందరో అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రంను మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చాడు. ఇప్పటికే తొమ్మిది పార్టీలు కూటమితో వలిసి వచ్చాయని, అన్ని పార్టీలను కూటమిలోకి ఆహ్వానించి, రాబోయే రోజుల్లో ఒక పెద్ద రాజకీయ పార్టీగా తెలంగాణ రాజకీయ కూటమి. విస్తదిస్తందని తెలిపారు. కూటమి అధ్యక్షులు గాలి వినోదక్కుమార్ మాట్లాడుతూ రాజకీయ కూటమి ద్వారానే ఎస్సి, ఎస్టీ, బీసీలకు రాజకీయ అమాశం సాధ్యమని, ఈ లక్ష్యాన్ని వేరుకోవాలపటి మరిన్ని రాజకీయ పార్టీలు కూటమిలో చేరాల్సిన అవసరం ఉండని అన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపి మూడు ప్రధాన పార్టీలు విఫలం అయ్యాయని, అందుకు నాలుగవ ప్రత్యామ్నాయ పార్టీగా, రాజకీయశక్తిగా, తెలంగాణ రాజకీయ కూటమి ఏర్పడిందని స్పష్టం చేశారు. ఇండియన్ క్రిస్టియన్, సెక్యులర్ పార్టీ ప్రధాన కార్యదర్శి డేవిడ్ ఆంధ్రూ మాట్లాడుతూ క్రైస్తవులు కూడా రాజకీయాలలో భాగస్వాములు కావాల్సిన ఆవసరం ఉందని, చర్చ్ లపై దాడులు పెరిగిపోతున్న ఈ సేపధ్యంలో రాజకీయ శక్తితో వాటిని ఎదుర్కోగలమని తెలిపారు. ఈ సమావేశంలో మహాజనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల ప్రదీప్తి గౌడ్ ఆధాద్ పార్టీ ఈసీ మెంబర్ డాక్టర్ శేషగిరరావు బహుజన రాజ్యం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలు నాయక్ రామాపత్, టీఆర్ఎల్డి అధికార ప్రతినిధి గౌర వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ లో గల భూదేవి శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవంలో భాగంగా బుధవారం శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు వంశీధరాచార్యులు రామకృష్ణమాచార్యులు శ్యాంసుందర్ ల వేదోచ్చ రణల మధ్య కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. కళ్యాణాన్ని తిలకించేదుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దేవాలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అమ్మవారి నామస్మరనతో మారుమోగింది. కళ్యాణ అనంతరం భక్తులు అమ్మవారి ఆశీస్సులు తీసుకొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ధర్పల్లి అశోక్ దంపతులు, వైస్ చైర్మన్ శాంతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగభూషణరావు, కోశాధికారి శ్రీమన్నారాయణ, జాయింట్ సెక్రెటరీ తులసి కృష్ణమూర్తి, సభ్యులు భోగేశ్వర రావు, విజయకుమార్, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస రావు, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకారావు, సురేంద్ర రాజు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




ఆదివారం ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరియు మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంత రావు, కలవేన శంకర్ తదితరులు.




## టీఎన్జీవో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు

**విశ్వంభర, బంజారాహిల్స్ :** టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి ముజీబ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు ముఖ్యఅతిథిగా హాజరై టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేష్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ చిలక నరసింహ రెడ్డి , పరమేశ్వర ,సంతోష్ కుమార్, 33 జిల్లాల అధ్యక్ష ,కార్యదర్శులు, సెంట్రల్ యూనియన్ కార్యవర్గం పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువగా సత్వర సేవలు

**- సబ్ రిజిస్టర్ రామ్ భూపాల్**



**విశ్వంభర, సరూర్ నగర్ :** ప్రజలకు చేరువ గా సత్వర సేవలు అందించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని సరూర్ నగర్ సబ్ రిజిస్టర్ రామ్ భూపాల్ అన్నారు. అందులో భాగంగానే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డయాసును తొలగించడం జరిగిందని తెలిపారు. డయాసు ఉండడంతో గృహ, ప్లాట్స్ లాంటి సేవల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తీసివేశారని తెలిపారు.

## సీపీఐ భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

**- కార్యవర్గ సభ్యులు బాతరాజు**



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఖమ్మం లో ఆదివారం జరిగే సిపిఐ 100 సం,రాల సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ అన్నారు. శనివారం సీపీఐ సరూర్నగర్ మండల కార్యాలయం కామ్రేడ్ ధర్మ బిక్షం భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు పదివేల మంది జనసేవదళ్ కార్యకర్తలతో కవాతుంటుంది అని జనసేవదళ్ కార్యకర్తలు అందరూ సమయానికి హాజరు అవుతారని తెలిపారు. బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి , మాజీ ఎంపీ డి రాజా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరు అంటున్నట్లు పేర్కొన్నారు. సరూర్నగర్ మండలం నుండి భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, రమావత్ సక్రు నాయక్ , గ్యార క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన రామ్ నరసింహ గౌడ్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ను మర్యాద పూర్వకముగా కలసి సంక్రాంతి శుభాకాంక్షలు" తెలిపిన శ్రీ రామకృష్ణ పురం డివిజన్(35) బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్.ఈ సందర్బంగా కేటిఆర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎన్నికల్లో శ్రీ రామకృష్ణా పురం డివిజన్ లో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేసి కార్పొరేటర్ ను కైవసం చేసుకోవాలని సూచించినట్లు రామ్ నరసింహ గౌడ్ తెలిపారు.

ప్రజా విశ్వంభర

# జన రాజ్యంలో విధేయత!?



అఖిల భారత సర్వీసులకు చెందిన ఉన్నతాధికారి ఒకరు ముఖ్యమంత్రికి కొన్నాళ్ల క్రితం పాదాభివందనం చేయడం ఈ ప్రస్తావనకు సందర్భం. ఆధునిక సమాజాలు, ముఖ్యంగా ప్రజాస్వామిక వ్యవస్థల్లో వ్యక్తులకు విధేయులై ఉండనక్కర లేదు. వ్యక్తి పూజలు సమర్థనీయమైనవి కాదు. ఆధునిక సమాజంలో వ్యక్తులు కాదు వ్యవస్థలే ప్రధానం.
వ్యవస్థ కోసం పని చేయవలసిన అధికార గణం అధికారంలో ఉన్న పెద్దలకు లొంగిపోయిన ఈ సందర్భం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఈ దేశం మళ్ళీ కృరమైన పూర్వపు రాచరికంలోకి ప్రవేశించిందా అనే అనుమానం, భయం కలిగిస్తున్నాయి. ఈ సమాజం తన కోసం తానే రాసుకున్న విధాన పత్రం లాంటి రాజ్యాంగానికి మాత్రమే అన్ని రాజ్యాంగ వ్యవస్థలు విధేయతను ప్రకటించాలి, ఆచరించాలి.
వ్యవస్థల్లోని అత్యున్నత కుర్చీల్లో కూర్చునే ఏ వ్యక్తికీ విధేయతను ప్రకటించ నక్కర లేదు. విధాన నిర్ణయాల్లో కీలక పాత్రను పోషించే అత్యున్నత అధికారుల్లోని కొందరు కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్)కు తల లాంటి ప్రభుత్వంలోని పెద్దలకు "జీ హుజూర్, నీ బాంచన్ దొర" తరహా భృత్యు పాత్రలో జీవించి పోతున్నారు. వారిలో కొందరు పాదాభివందనాలు చేస్తున్నారు. బహిరంగ వేదికల్లో ఆ పెద్దలకు స్తోత్ర పాఠాలు చదువుతూ, ఇంద్రుడు చంద్రుడు అని పేర్కొంటూ వందిమాగధ పాత్రను పోషిస్తున్నారు.
అత్యున్నత విద్యావంతులై, దేశంలోనే ప్రతిష్టాత్మకమైనదిగా భావించే అత్యంత కఠినమైన జాతీయ స్థాయి పోటీ పరీక్ష (యూ.పీ. ఎస్.సీ)ల్లో ఉత్తీర్ణులై ఐ.ఏ.ఎస్, ఐ.పీ.ఎస్ లాంటి అఖిల భారత సర్వీసులకు ఎంపికైన అత్యంత ప్రతిభావంతులు కూడా అధికారానికి సాగిలపడి పోవడం అవాంఛనీయ పరిణామం. ఎనిమిది దశాబ్దాల క్రితమే వలస పాలన నుంచి దేశం స్వతంత్రమై పోయినా రాచరికంలో కొనసాగిన దాస్యపు ధోరణి ఇప్పటికీ కొనసాగుతూ ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సైన్స్ ఇంతగా ఎదిగిపోయి, అనేక ప్రకృతి సత్యాలను తెలుసుకున్న తరువాత కూడా జ్ఞానులు, మేధావులుగా సమాజం గుర్తించి, గౌరవించే వ్యక్తులు అహేతుకంగా, గుడ్డిగా కొందరు అధికారంలోని పెద్దలకు విధేయులై పోవడం ఏమిటో! వారు ఎంపికైంది రాజ్యాంగ పరిధిలో పని చేయడానికి మాత్రమే కదా. వారు ఆ మౌలిక కర్తవ్యాన్ని పక్కన పెట్టడానికి అర్థం ఏమిటి? అనేది పౌర సమాజం తీవ్రంగా ఆలోచించ వలసిన సంగతి.
ప్రతి వ్యక్తి సమాజానికి, ఆ సమాజ ఉనికికి ఆధారమైన ప్రకృతికి మాత్రమే విధేయుడిగా ఉండడం హేతుబద్ధమైన, పరిణతితో కూడిన వైఖరి. సమాజాన్ని నడిపించే వ్యవస్థ(చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ,పత్రికా రంగం అనే నాలుగు స్తంభాలు)లు సక్రమంగా, సమర్థంగా పని చేయగలిగితేనే ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ,స్వాతంత్ర్యం నిలదొక్కుకుంటాయి. ఈ వ్యవస్థలను సక్రమంగా, సమర్థంగా పని చేయించగలిగేది, చేయించవలసింది కార్యనిర్వాహక (ఎగ్జిక్యూటివ్)వ్యవస్థలోని ఉన్నతాధికారుల బృందమే.
అదే దాని కర్తవ్యం. అలా పని చేసినప్పుడే ప్రజాస్వామ్యంగా పిలుచుకునే ఈ జనరాజ్యం వర్థిల్లగలుగుతుంది. రాజ్యాంగ లక్ష్యం నెరవేరే అవకాశాలు ఉంటాయి. అపుడే ఈ సమాజం ఆధునిక నాగరిక సమాజంగా పిలవబడుతుంది. ఎన్నికల ద్వారా ప్రజలు తమ ప్రతినిధులుగా నిర్ణయించుకున్న వారితో రూపొందే చట్టసభలు చేసే చట్టాలు, నిర్ణయాలు ప్రభుత్వ విధానాలుగా రూపుదిద్దుకోవడం ప్రజాస్వామిక వ్యవస్థ చేయవలసిన పని. ఆ విధాన నిర్ణయాలను అట్టడుగు స్థాయిలోని చివరి వ్యక్తి వరకు అమలు చేయించి ప్రజాధనాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయించవలసిన కీలక పాత్రను నిర్వర్తించవలసిన బాధ్యత ఉన్నతాధికార వ్యవస్థకు రాజ్యాంగం అప్పగించింది. ఆ బాధ్యతను పక్కన బెట్టి సర్కారులోని కొందరు పెద్దలకు, అధికారానికి విధేయులై పోయి, దాసోహమవుతున్న సంఘటనలు దేశంలోని అనేక చోట్ల తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ ధోరణి ఏ మాత్రం సమర్థనీయం కాదు. అలాంటి వైఖరి, ధోరణులను జనం మధ్యలో బహిరంగంగా ప్రదర్శించడాన్ని ఎలా చూడాలి? ఎలా అర్థం చేసుకోవాలి? అనుచిత వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనం ఆశించి మాత్రమే ఇలాంటి భృత్యు పాత్రను పోషిస్తున్నారని సందేహించవలసి వస్తున్నది. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఎలాంటి వారినైనా తాము నమ్మితే చాలును, వారిని మోయడం, వారికి వీరపూజ చేయడం, భజన చేయడం,
స్తోత్ర పాఠాలు వల్లించడం, వారి పల్లకిని మోయడం, తానా అంటే తందాన అనడం లాంటి ఒక అపరిపక్వ ధోరణి ఇప్పుడు ఈ సమాజంలో వేగంగా విస్తరిస్తూ పోతున్నది. ఇది ఎంత మాత్రం ఎదిగే సమాజ లక్షణం కాదు.
ఆమోదనీయం, సమర్థనీయం కూడా కాదు. స్వతంత్రం వచ్చిన కొత్తలో ఇలాంటివి చాలానే జరిగాయి. వలస పాలన అంతరించిన తరువాత వచ్చిన కొత్త వ్యవస్థ కాబట్టి అప్పట్లో పాత వ్యవస్థ అవశేషాలు అలాంటి ప్రవర్తనకు దారి తీసాయేమో అని సర్ది చెప్పుకోవచ్చు. అలా అప్పుడు సమాజం దానిని పెద్దగా పట్టించుకోలేదు. తరువాత కూడా అలాంటి ధోరణి కొందరు ఉన్నతాధికారుల నుంచి వ్యక్తమైంది. "ఇండియానే ఇందిర, ఇందిరే ఇండియా" అని భజన చేసిన వారిని కూడా చూసింది సమాజం. అధికారానికి తలొగ్గి ప్రవర్తించిన అత్యున్నత న్యాయాధికారులను కూడా చూసింది. కాలక్రమంలో ఆ ధోరణి బాగా తగ్గిపోయింది. తరువాతి కాలంలో ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రుల రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలను ప్రశ్నించి, ఎదిరించి కర్తవ్య బద్ధులైన నికార్సయిన అనేక మంది ఉన్నతాధికారులను, న్యాయాధికారులను సమాజం చూసింది. ఆ ధోరణిని సమాజం స్వాగతించింది. అలాంటి అధికారులను సమాజం ఎంతో గౌరవించింది. కానీ ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నది కదా. కాని ఈ దూర్త ధోరణి పలువురు ఉన్నతాధికారుల్లో ఇప్పటికే వ్యక్త మవుతూనే ఉన్నది. ఇటీవల అలాంటి "అత్యద్భుత సన్నివేశం" తెలంగాణలో ఆవిష్కృతమైంది. ఒక జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి బహిరంగసభలో పాదాభి వందనం చేసిన ఆ సన్నివేశం మీడియా ద్వారా మొత్తం ప్రపంచం చూసింది. చెప్పుల(శ్రీ రాముడు పాదుకలతో భరతుడు పాలనచేసిన)తో రాజ్యపాలన చేయడానికి ఇదేమైనా త్రేతాయుగమా? లేక ఇప్పుడు ఇక్కడ కొనసాగుతున్నది వెనకటి రాచరిక వ్యవస్థనా ? 21 వ శతాబ్దంలోకి వచ్చి కూడా 25 యేళ్ళు గడిచి పోయాయి కదా ఈ ఆధునిక సమాజంలో, ప్రజాస్వామిక వ్యవస్థలో భృత్యుల తరహా దాస్యపు ధోరణి ఏమిటి? ఆత్మ న్యూనత! విధేయత! పరాధీనతలకు రాజకీయాలు లాభసాటి పూర్తిగా వ్యాపారంగా మారిపోవడం,
ఆ అధికారానికి లొంగి పోవడం వల్ల కలిగగల ఆర్థిక ప్రయోజనాల ఆశ ఈ పాద పూజలకు కారణం అయి ఉంటుంది.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

## హిందీ సాహిత్య దిగ్గజం హరి వంశ్ రాయ్

### నేడు ఆయన వర్ధంతి



డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ ( 1907 నవంబరు 27 2003 జనవరి 18) 20 వ శతాబ్దం ప్రారంభంలో హిందీ సాహిత్యంలోని నయీ కవితా సాహిత్య ఉద్యమం లోని భారతీయ కవి. హిందీ సాహిత్యంలో సాటిలేని వారసత్వా న్ని మిగిల్చిన సాహిత్య దిగ్గజం ఆయన. 20వ శతాబ్దపు ఛాయా వాద ఉద్యమం మార్గదర్శకునిగా పరిగణించబడే హరివంశ్ రాయ్ బచ్చన్ గురించి ప్రస్తావించ కుండా హిందీ సాహిత్యం గురించి ప్రస్తావిం చడం సాధ్యం కాదు. 60 సంవత్సరాల పాటు సాగిన సాహిత్య జీవితంతో, బచ్చన్ 30కి పైగా కవితలు రాశారు. ప్రతి ఒక్కటి శక్తివంతమైన చిత్రాలతో, సమ కాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉన్నాయి.
హరివంశ్ రాయ్ బచ్చన్ బ్రిటిష్ ఇండియా లోని యునైటెడ్ ప్రావి న్సెస్ ఆఫ్ ఆగ్రా లోని ప్రతాప్ గఢ్ జిల్లాకు చెందిన బాబు పట్టి గ్రామం లో కాయస్థ కులంలోని శ్రీవాస్తవ వంశానికి చెందిన అవధి భారతీయ హిందూ కుటుంబంలో నవంబర్ 27, 1907న జన్మించారు.ఆయన ముందు శ్యామాను వివాహం చేసుకోగా, ఆమె త్వరగా మరణించడంతో మళ్లీ తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. అనేక ప్రసిద్ధ కవితలు వ్రాసారు. సిల్సిలా (1981), ఆలాప్ (1977) మరియు ఫిర్ భీ (1972) అనే బాలీవుడ్ చిత్రాలలో గీత రచయి తగా కూడా పనిచేశారు.
1941 నుండి 1957 వరకు, అలహా బాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా బోధించారు. ఆ తరువాత రెండు సంవత్స రాలు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన సెయింట్ కాథరీన్ కళాశాలలో ప్రఖ్యాత ఐరిష్ రచయిత డబ్ల్యూ.బి.యీట్స్ రచనలపై పి.హెచ్.డి చేసారు. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో పి హెచ్ డి చేసిన మొదటి భారతీయునిగా గుర్తింపు పొందారు. హరివంశ్ రాయ్ హిందీ కవిత్వం రాసేటప్పుడు సాధారణంగా సాంప్ర దాయంగా ఉపయోగించే శ్రీవాస్తవ వంశ పేరుకు బదులుగా "బచ్చన్" (బాలుడు) అనే కలం పేరును ఉపయో గించారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత, అలహాబాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం బోధించారు. అలహా బాద్‌లోని ఆల్ ఇండియా రేడియోలో కూడా పని చేశారు. బచ్చన్ అనేక హిందీ భాషలలో (హిందూస్థానీ, అవధి) నిష్ణాతులు. దేవనాగరి లిపిలో రాసిన కవితల్లో హిందూస్థానీ పదజాలం విస్తృతంగా వాడారు. ఒమర్ ఖయ్యామ్ చేత పర్షియన్, ఉర్దూ కవిత్వం పట్ల ప్రభావితమయ్యారు.
బచ్చన్ తన ప్రారంభ రచన మధుశాల ద్వారా అనూహ్య గుర్తింపు పొందారు. సామాన్యుడి దృక్కోణంలో రాసిన ఆయన కవితలు దేశంలోని అసంఖ్యాక సామాన్యులకు స్వరం వినిపిం చాయి. బచ్చన్ కవిత్వం స్వేచ్ఛ కోసం సామాన్యుని కోరిక, జీవితం, మరణం, ప్రేమ, వాంఛ మొదలైన అనేక ఇతి వృత్తాలతో ముడి పడి ఉంది. హరివంశ్ రాయ్ అనేక కవితలు ఆయన వ్యక్తిగత జీవితం, విషాదాల నుండి ప్రేరణ పొందాయి. బచ్చన్ రచించిన చాలా కవితలలో ప్రేమికుడి వేదన ప్రధానమైన ఇతివృత్తాలలో ఒకటిగా నిలిచింది. మధుశాల అనేది 135 పద్యాల కవిత్వం, ఇది హరివంశరాయ్ బచ్చన్‌ను ఎనలేని గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆంగ్లం, మలయాళం, బెంగాలీ మరియు మరాఠీలోకి అనువదించ బడింది. హరివంశ్ రాయ్ బచ్చన్ రచించిన అత్యంత ప్రజాదరణ పొందిన కవితలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే వారికి ప్రేరణగా బచ్చన్ అగ్నిపథ్' అనే కవితను రాశారు.
1969లో సాహిత్య అకాడమీ అవార్డుతో బచ్చన్ ను సత్క రించారు. 1976 లో హిందీ సాహిత్యానికి చేసిన సేవకు గాను పద్మ భూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన భార్య తేజీ బచ్చన్ సామాజిక కార్యకర్త. హరివంశ్ రాయ్ కుమారుడు, మనుమడు పరిచయం అక్కరలేని ప్రఖ్యాత హిందీ నటులు అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్. హిందీ సాహిత్యంలో తనదంటు ప్రత్యేక ముద్ర వేసుకున్న బచ్చన్ దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై, 2003 జనవరి 18న తనువు చాలించారు.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# స్నాన, దాన, జప, తపాలకు అనువైన మాఘ మాసం





సనాతన హిందూ సంప్రదాయంలో మాఘ మాసంలో చేసే నదీ స్నానానికి, శ్రీమన్నారాయణుడిని పూజించి, శక్తికొలది దాన, ధర్మాలు చేస్తే కోటి యజ్ఞాలు చేసినంత ఫలితం కలుగుతుంది.
మాఘ మాసంలో ఏ నది నీరైనా గంగానదితో సమానం అని శాస్త్ర వచనం. ఈ మాసంలో చేసే నదీ స్నానం, దాన ధర్మాలు, పూజలు, వ్రతాలు సర్వపాపాలను హరిస్తాయని హైందవులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. బ్రహ్మాండ పురాణం, పద్మ పురాణం మాఘ మాసం వైశిష్ట్యాన్ని, ముఖ్యంగా మాఘ స్నానం పవిత్రతను తెలియజేస్తున్నాయి.

**మాఘ మాసం వైశిష్ట్యం**

మాఘ మాసం ఎంతో విశిష్టమైనది. ఈ మాసంలో వచ్చే ముఖ్యమైన తిథి "శుక్ల పక్ష చవితి" దీనిని "తిల చతుర్థి"అంటారు. దీన్నే కుంద చతుర్థి అని కూడా అంటారు. ఈ మాసంలో నువ్వులను తింటారు. నువ్వులతో లడ్డు చేసి పంచి పెడతారు. ఈ రోజున "దుండి రాజు ను" (గణపతి)ని ఉద్దేశించి, నక్త వ్రతము (రాత్రి జాగరణ) పూజ చేస్తారు. దూండిని ఈ విధంగా పూజించడం వలన దేవతల చేత సైతం పూజలందుకుంటారని కాశీ ఖండములో తెలియజేశారు. కుంద చతుర్థి నాడు కుంద పుష్పాలతో పరమేశ్వరుని అర్చించి రాత్రి జాగరణ చేసినవారు, సకలైశ్వర్యాలను పొందుతారని కాలదర్శనంలో చెప్పబడింది. అయితే సాయంకాలం చతుర్థి ఉంటే ఉత్తమం అని ఈ సందర్భంలో తెలుసుకోవాలి. మాఘ మాసంలో ప్రాత:కాలంలో చేసే స్నాన,జప,తపములు చాలా ఉత్తమమైనవి. ఈ మాసంలో స్నానం చేసేటప్పుడు
దు:ఖ దారిద్ర్య నాశాయ,
శ్రీ విష్ణోతోషణాయచ। ప్రాత:స్నానం కరోమ్య: మాఘ పాప వినాశనం॥"
అని చేసిన తరువాత
"సవిత్రే ప్రసవిత్రే చ; పరంధామ జలేమమ। త్వత్తేజసా పరిభ్రష్టం;
పాపం యాతు సహ్రదా॥"
అని చదవాలి.
సూర్య భగవానునికి ఆర్ఘ్యమివ్వాలి.
ఈ మాసాన్ని కుంభమాసం అని కూడా అంటారు. కొందరు ఈ నెల రోజులూ ముల్లంగి దుంపను తినరు. ఈ మాసంలో నువ్వులను, పంచదారను కలిపి తినాలి. నువ్వులను దానమివ్వాలి. రాగి పాత్రలో గోధుమ రంగుగా ఉన్న నువ్వులను పాత్రతో సహా దానమిస్తే మంచిది. ఈ నెలలో మరణించిన వారికి అమృతత్వం సిద్ధిస్తుందని శాస్త్రం చెబుతోంది.



**శ్రీ పంచమి (సరస్వతీ దేవి ఆవిర్భావం)**

మాఘశుద్ధ పంచమి ని శ్రీ పంచమి అంటారు.
ఈ పంచమి నాడే సరస్వతీ దేవి జన్మించింది. ఈనాడు రతీ మన్మధులను మల్లె పూలతో పూజిస్తారు. ఉత్తర భారతంలో విష్ణుమూర్తిని, సరస్వతీదేవిని కూడా పూజిస్తారు. బ్రహ్మదేవుడు సృష్టి చేయగా చరాచర ప్రపంచం శ్మశాన నిశ్శబ్ధతతో ఉంది. అవేదనతో తన కమండలంలోని నీటిని ప్రపంచంపై చిలకరించగా చెట్లపై ఆ నీటి బిందువులు పడి ఒక శక్తి ఉద్భవించింది. రెండు చేతులతో వీణను వాయిస్తూ మరో రెండు చేతులతో పుస్తకాన్ని మాలను ధరించి సమగ్ర రూపిణిగా దర్శనమిచ్చింది. ఆ వాగీశ్వరి వీణావాదనం ద్వారా ప్రపంచంలోని స్తబ్ధతను ఉదాసీనతను తొలగించి విద్యాబుద్ధులకు అదిష్టాత్రి అయింది ఆ దేవి.
అప్పటి నుండి శ్రీ పంచమి రోజును సరస్వతీదేవి ఆవిర్భావం దినంగా పూజించడం జరుగుతుంది.
రథ సప్తమీ (ఆదిత్య హృదయం పారాయణం)
మాఘ శుద్ధ సప్తమీ దీనినే సూర్య సప్తమి అని కూడా పిలుస్తారు.ఇదే రథసప్తమి సూర్య గ్రహణ దినం వలె ఇది పరమ పవిత్రమైనది.
ఈ రోజున అరుణోదయకాలంలో ఏడు జిల్లేడు ఆకులను అందులో రేగికాయలను ఉంచుకొని తలాపై పెట్టుకొని స్నానం చేస్తే ఏడు విధాలైన శాపాలు నశిస్తాయట. స్నానానికి ముందు చెరకుగడతో నీటిని కదిలిస్తారు.
నమస్కారం ప్రియ:సూర్య: అన్న ఆర్య వాక్య ప్రకారం కేవలం నమస్కారం చేతనే సూర్యుడు సంతృపి చెందుతాడని తెలుస్తుంది. ఈ రోజున చిక్కుడు కాయలతో రథం చేసి కొత్త బియ్యంతో పాయసాన్ని వండి చిక్కుడు అకులలో పెట్టి సూర్యునికి నివేదన చేయడం ఆచారం.
సూర్యుడు తనను పూజించిన సత్రాజిత్తుకి ఈ రోజునే "శమంతకమణి" ని ప్రసాదించాడు. హనుమంతునికి వ్యాకరణ శాస్త్రాన్ని, యాజవల్క్యునికి యజుర్వేదాన్ని బోధించాడు. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అన్న వాక్యం ప్రకారం ఆరోగ్యం కొరకు ఆదిత్య హృదయం పారాయణ చెయ్యాలి. రథసప్తమి నాటి స్నానం "సప్త సప్త మహా సప్త ద్వీపా వసుంధరా!
కోటి జన్మార్జితం పాపం వినశ్యతి తత్ క్షణాత్" అన్నట్లుగా పాప విముక్తి కలిగిస్తుంది.
భీష్మ ఏకాదశి (విష్ణు సహస్ర నామ పారాయణం ఆరంభం)

**మాఘమాసస్యచాష్టమ్యాం**

శుక్ల పక్షేచ పార్థివ!ప్రాజాపత్యేచ నక్షత్రే మధ్య:ప్రాప్తే దివాకరే!"
మాఘమాసంలో శుక్లపక్షంలో రోహిణి నక్షత్రం ఉన్న ఏకాదశి తిథినాడు మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తూ ఉండగా అభిజిత్ లగ్నంలో భీష్మ పితామహుడు ధ్యాన స్థితుడై ప్రాణాలను విడిచిపెట్టాడట. స్వచ్ఛంద మరణం ఆయనకి వరం. ఆయనకు తర్పణలు విడిచి పెట్టడం నెలగంటు పెట్టినప్పటినుంచీ పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి దాచి ఆ పిడకలతో పాయసాన్ని వండి నివేదన చేయడం ముఖ్యం. అష్టమినాడే దైవ సాయుజ్యం పొందినా శ్రీ కృష్ణుని సమక్షంలోనే విష్ణుసహస్రనామాలతో ఆయనను కీర్తిస్తూ మోక్షం పొందాడు. కాబట్టి ఏకాదశిని ఆయన పేరుతో ఏర్పాటు చేశారు. భీష్మ ఏకాదశి నాడు విశేష పూజలు చేయడం ఆనవాయితీ. ఇక మాఘమాసంలో వచ్చే ప్రతి ఆదివారాలు మహిమాన్వితాలే.ఈ విధంగా మాఘమాసమంతా "శివరాత్రి"వరకూ అన్నీ పర్వ దినాలే.
మాఘమాసమున అనగా మకరరాశిలో రవి ఉండే తరుణంలో నెల రోజులు నియమానుసారంగా మాఘమాస స్నానం చేస్తే చాలు, వారి వారి కోరికలన్నీ తప్పక నెరవేరుతాయి. అని పద్మపురాణంలో ఉత్తరఖండంలో పేర్కొనబడింది.
మాఘ స్నాయీ వరారోహు దుర్గతిం వైవ పశ్యతి
తన్నాస్తి పాతకం యత్తు మాఘస్నానం న శోధయేత్
అగ్ని ప్రవేశాదధికం మాఘస్నానం న శోధయేత్
జీవితా భుజ్యతే దుఃఖం మృతేన బహుళం సుఖమ్
ఏతస్మాత్కారణేద్భద్రే మాఘస్నానం విశిష్యతే"
మాఘస్నానానికి ఒక ప్రత్యేకత ఉంది. చాలామంది మాఘమాసం కోసం ఎదురుచూస్తుంటారు.దీనికి కారణం ఈ మాఘస్నానాల వెనుక ఉన్న ప్రత్యేకత, ప్రయోజనాలే. మాఘమాసం స్నానానికి ప్రసిద్ధి. మాఘస్నానం ఇహపరదాయకం. సూర్యుడు ఉదయించే సమయంలో స్నానం చేస్తే మహాపాతకాలు నశిస్తాయని కమలాకర భట్టు రచించిన నిర్ణయ సింధులో చెప్పారు.
బ్రహ్మచర్య, గృహస్త, వానప్రస్థ, సన్యాసాశ్రమాలవారూ, అన్ని వర్ణములవారూ, వర్గములవారూ, ప్రాంతాలవారు ఈ మాఘస్నానం చేయవచ్చు.మాఘమాసంలో సూర్యుడు మకరరాశిలో ఉండే సమయంలో సూర్యోదయానికి ముందు వేడి నీటిలోనైనా ఇంట్లో స్నానం చేసినా ఆరు సంవత్సరాల అఘమర్షణ స్నాన ఫలం లభిస్తుంది. ఇంట్లో బావి నీటి స్నానం చేస్తే పన్నెండు సంవత్సరాల పుణ్యస్నాన ఫలాన్నీ, తటాక స్నానం ద్విగుణం, నదీస్నానం చతుర్గుణం, గంగా స్నానం సహస్రగుణం, గంగాయమునా సంగమ (త్రివేణి) స్నానం నదీ శత గుణ ఫలాన్నీ ఇస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. అయితే మాఘమాసంలో ఇంట్లో స్నానం చేసేటప్పుడు గంగాయమునాది దివ్య తీర్థాలను స్మరించి స్నానం చేయాలని 'నిర్ణయ సింధు'లో స్పష్టం చేశారు.
"దుఃఖ దారిద్ర్య నాశయ
శ్రీ విష్ణోస్త్రోషణాయచ
ప్రాతఃస్నానం కరోతు
మధ్య మాఘే పాప వినాశనం"
మకరస్థే రవౌ మాఘే
గోవిందాచ్యుత మాధవ
స్నానేనానేన మేదేవ
యధోక్త ఫలదోభవ"
అనే ఈ శ్లోకం పఠిస్తూ స్నానం ఆచరించాలి.
రోజూ సమయాభావంవల్ల, అనారోగ్యంవల్ల చేయలేనివారు మాఘంలో పాడ్యమి, విదియ, తదియ తిథులలో స్నానం చేసి, మళ్లీ త్రయోదశి, చతుర్దశి మాఘ పూర్ణిమ తిథులలో స్నానం చేయవచ్చు.
ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించిన తరవాతే మాఘమాసం రావటం విశేషంగా చెప్పుకోవాలి. ఈ మాసంలో సూర్యారాధన, శివోపాసన, విష్ణ్వార్చన వంటివి విశేష ఫలాన్నిస్తాయి. సర్వదేవతలకు ప్రీతికరమైన మాసం మాఘమాసం. కార్తీకమాసం దీపానికి ప్రధానమైనట్లే మాఘమాసం స్నానానికి ముఖ్యం.
సూర్యోదయానికి ముందు నదీ స్నానం ఉత్తమం. నది అందుబాటులో లేనివారు తటాకం గానీ, బావి గానీ స్నానానికి మంచిది. ఇవేమీ అందుబాటులో లేనప్పుడు పవిత్ర నదీ స్మరణతో
'గంగేచ యమునేచైవ, గోదావరి సరస్వతీ, నర్మదే సింధు కావేరీ,
జలేస్మిన్ సన్నిధింకురు" అని శ్లోకం చెప్పుకుంటూ స్నానం చేయాలి.
మాఘ స్నానాలన్నింటిలోకి త్రివేణి సంగమ స్నానం ఉన్నతమైన ఫలితాన్ని అందిస్తుందని ధర్మశాస్త్ర వచనం. ఉత్తర భారతదేశంలో ఈ నదీ స్నానానికి విశేష ఆదరణ వుంది. మాఘపూర్ణిమనాడు అశేష జనవాహిని త్రివేణి సంగమంలో, గంగానదిలో పవిత్ర స్నానాలు చేస్తారు. దక్షిణ భారతంలో కృష్ణ, గోదావరి, కావేరి నదుల్లో స్నానమాచరిస్తారు. స్నానమాచరించు సమయంలో, శివకేశవాది దేవతా స్మరణ, గంగాయమున, సరస్వతి, గోదావరి వంటి పుణ్యనదుల స్మరణ చేయాలి. అదేవిధంగా ఈ మాసంలో దానం, జపం విశేషంగా చేస్తే ఎంతో మంచిది.
పవిత్రమైన విశేషమైన మాఘ స్నానాన్ని సద్వినియోగం చేసుకొని పుణ్య ఫలాన్ని పొందటానికి అందరూ ముందుండాలి. ఈ స్నానం ఆధ్యాత్మికతకు పునాదులు వేస్తుంది. మాఘ మాసంలో పుణ్యమైన మాఘ స్నానమే కాకుండా ఇంకా ఎన్నో పుణ్యదినాలున్నాయి. ఈ మాసంలో దూండి గణపతి పూజ, శ్రీపంచమి, భీష్మైకాదశి, మహాశివరాత్రి, రథసప్తమి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఏ మాసంలో వచ్చే విశేష దినాలను ఆచరిస్తే మానసిక శాంతి, ఆధ్యాత్మికత, పుణ్యఫలం లభిస్తాయని ఋషులు ఆదేశించారు. ఈ కలియుగంలో కనీసం జనులు శక్తి వంచన లేకుండా కొన్ని ధార్మిక సంప్రదాయాలను, ఆధ్యాత్మిక నియమాలను పాటిస్తూ సనాతన ధర్మాన్ని ఆచరించాలి.



- చౌదూరి నరసింహారావు
సాహిత్య కళా విభూషణ
నంది పురస్కార గ్రహీత
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
: 9705100788




## కొత్త వైరస్ కలకలం..

### వంద మందికి సోకిన మహమ్మారి..!!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** చైనాలోని ఒక పాఠశాలలో అకస్మాత్తుగా వైరస్ వ్యాప్తి కలకలం సృష్టించింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్య శాఖలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఆరోగ్య నిపుణులు నిర్వహించిన పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ సమాచారం వెలుగులోకి రావడంతో స్థానిక అధికారులు తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టారు.

వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు స్కూల్ క్లాస్‌రూములు, కారిడార్లు, ఆవరణ మొత్తం శానిటైజ్ చేసి, వైరస్‌ను నిర్మూలించే ప్రత్యేక మందులను పిచికారీ చేశారు. బాధిత విద్యార్థులకు అవసరమైన వైద్య చికిత్స అందించడంతో పాటు, ఇతర విద్యార్థులకు వైరస్ సోకకుండా జాగ్రత్త చర్యలు అమలు చేస్తున్నారు. ప్రస్తుతం వైరస్ బారిన పడిన విద్యార్థుల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు వెల్లడించారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ప్రత్యేకంగా హాజరు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా, స్కూల్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారికీ పరీక్షలు నిర్వహించి, వైరస్ మరింత వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి మధ్యకాలంలో నోరో వైరస్ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి.

నోరో వైరస్ సోకినవారు సాధారణంగా వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో బాధపడతారని అధికారులు తెలిపారు. ఈ వైరస్ చాలా సాధారణమైనదే అయినప్పటికీ, వ్యాప్తి వేగంగా జరుగుతుందని హెచ్చరించారు. 1968లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్వాక్ పట్టణంలోని ఒక స్కూల్‌లో ఈ వైరస్‌ను తొలిసారి గుర్తించడంతో దీనికి నోరో వైరస్ అనే పేరు వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతున్నారని గణాంకాలు సూచిస్తున్నాయి. అందులో ఐదేళ్లలోపు చిన్నారులు సుమారు 20 కోట్ల మంది ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఈ వైరస్ కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది మృతి చెందుతుండగా, అందులో 50 వేల మంది చిన్నారులు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

## బీఆర్ఎస్ ముక్కలవ్వడం ఖాయం

### - రాంచందర్ రావు


**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ప్రదర్శించిన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. సుమారు ఐదు వేల సర్పంచ్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారని, గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పార్టీ గెలుపు శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని స్పష్టంగా చూపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాంచందర్ రావు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఉత్సాహంతో పోటీ చేస్తామని, ప్రజల మద్దతుతో విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన, ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని అన్నారు. అంతర్గత విభేదాలు, అసంతృప్తి కారణంగా బీఆర్ఎస్ భవిష్యత్తులో ముక్కలవడం తప్పదని వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై కూడా రాంచందర్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కంటే కమీషన్ల రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తున్నాయని, అయినప్పటికీ కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి, పట్టణ పాలనలో నిజమైన మార్పు తీసుకురావాలని ప్రజలకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ.. ఐపీఎస్ లు బదిలీలు..!!




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** మున్సిపల్ ఎన్నికల సమయానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొని 20 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలను అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు శనివారం సాయంత్రం సంబంధిత ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీలలో ప్రధాన నియామకాలు కింది విధంగా ఉన్నాయి:

లాజిస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్ జనరల్ ఇన్‌చార్జ్ (IG)గా గజారావు భూపాల్
విజిలెన్స్ డిప్యూటీ ఇన్‌చార్జ్ జనరల్ (DIG)గా అభిషేక్ మహంతి
ఇంటెలిజెన్స్ DIGగా ఆర్. భాస్కర్
ఫ్యూచర్ సిటీ అడిషనల్ సిటీ పోలీస్ (ACP)గా చందనా దీప్తి
సైబరాబాద్ డీసీపీగా టి. అన్నపూర్ణ
ట్రాఫిక్3 డీసీపీగా రాహుల్ హెగ్డే
సీఐడీ ఎస్పీగా ఆర్. వెంకటేశ్వర్లు
హైదరాబాద్ క్రైమ్ డీసీపీగా ఎస్. చైతన్యకుమార్
ట్రాఫిక్1 డీసీపీగా అవినాశ్ కుమార్
ఇంటెలిజెన్స్ ఎస్పీగా అపూర్వారావు
విజిలెన్స్ ఎస్పీగా బాలాస్వామి

ఈ బదిలీలు రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల సమయానికి పోలీస్ విభాగంలో సమర్థతను పెంపొందించడం, పటిష్టమైన పర్యవేక్షణ, ప్రాంతీయ భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టాయి. రాష్ట్రంలోని ఇతర 9 అధికారుల బదిలీల వివరాలు కూడా త్వరలో ప్రకటించనున్నారు.

# పారిశ్రామిక రంగంలో కొత్త వెలుగులు

- క్లీన్ ఎనర్జీ హబ్‌గా ఆంధ్రప్రదేశ్
- కాకినాడలో తొలి 'గ్రీన్ అమ్మోనియా' ప్లాంట్‌కు శంకుస్థాపన
- రూ. 15,600 కోట్ల పెట్టుబడి
- వేలాది మందికి ఉపాధి



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామికాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శనివారం కాకినాడలో 'ఏఎం గ్రీన్ ఎనర్జీ' సంస్థ నిర్మించనున్న భారీ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలుపుతామని ప్రకటించారు.

రాష్ట్ర అభివృద్ధిలో 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024' ఒక గేమ్ ఛేంజర్ అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి శుద్ధ ఇంధనాల ఉత్పత్తికి ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం విధానపరమైన స్పష్టత ఇచ్చిందని, తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. ప్రధాని మోదీ సహకారం, చంద్రబాబు నాయకత్వంలో ఏపీని గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామన్నారు.


**ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి**

ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు భారీగా ఉపాధి లభించనుందని పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణ దశలో 8,000 మందికి, నిర్వహణ దశలో 1,500 మందికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అనుబంధ రంగాల ద్వారా మరో కొన్ని వేల మందికి దీర్ఘకాలిక ఉపాధి లభించనుంది. బలమైన సంకల్పంతో ఈ స్థాయికి ఎదిగిన గ్రీన్ కో వ్యవస్థాపకులు చలమలశెట్టి అనిల్, మహేష్‌లను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడి, స్వరాష్ట్రంలో ఇలాంటి భారీ ప్రాజెక్టును చేపట్టడం గర్వకారణమని కొనియాడారు.

**ఏఎం గ్రీన్ ప్రాజెక్ట్ విశేషాలు**

కాకినాడలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో అత్యంత కీలకం కానుంది. 495 ఎకరాల విస్తీర్ణంలో, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ఈ ప్లాంట్ రూపుదిద్దుకోనుంది. రూ.15,600 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మొదలై, భవిష్యత్తులో 8 బిలియన్ డాలర్ల వరకు విస్తరించనుంది. 2027 చివరి నాటికి తొలి దశ కమిషనింగ్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## సంక్రాంతి తిరుగు ప్రయాణం: హైవేలపై భారీగా ట్రాఫిక్ జామ్!



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** సంక్రాంతి సంబరాలు ముగించుకుని పల్లెవాసులు మళ్లీ భాగ్యనగరం బాట పట్టారు. ఒక్కసారిగా వాహనాలు రోడ్లపైకి రావడంతో విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారి (NH65), అద్దంకినార్కట్‌పల్లి రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. అద్దంకినార్కట్‌పల్లి హైవేపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ముఖ్యంగా పొందుగుల బ్రిడ్జి, దామరచర్ల, మిర్యాలగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉంది. అటు విజయవాడ హైవేపై చిట్యాల, పెద్ద కాపర్తి, చౌటుప్పల్ ప్రధాన కూడళ్లలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**పోలీసుల అప్రమత్తత..దారి మళ్లింపులు ఇవే!**

పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ, వాహనాల సంఖ్య వేలల్లో ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులు జరుగుతుండటంతో పరిస్థితిని బట్టి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు.

విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలను కోదాడ వద్దే నిలిపివేసి, వాటిని హుజూర్‌నగర్, మిర్యాలగూడ మీదుగా మళ్లిస్తున్నారు. అద్దంకినార్కట్‌పల్లి రోడ్డుపై వచ్చే వాహనాలను మిర్యాలగూడ వద్ద మళ్లించి.. హాలియా, మల్లేపల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. చిట్యాల వద్ద రద్దీ పెరిగితే, వాహనాలను భువనగిరి మీదుగా హైదరాబాద్ చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

**డ్రోన్ల నిఘా..**

ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు పోలీసులు డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలను ఉపయోగిస్తున్నారు. టోల్ గేట్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించి వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు. హైవేపై రద్దీ దృష్ట్యా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## ఎంఐఎం విజయంపై ఒవైసీ హర్షం..!!




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మహారాష్ట్రలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా మజ్లిస్‌ఇత్తెహాద్‌ఉల్‌ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీ గణనీయమైన విజయాలను నమోదు చేసి రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఔరంగాబాద్, ముంబై, నాగ్‌పూర్ వంటి ప్రధాన నగరాల్లో పార్టీ బలంగా తన ఉనికిని చాటుతూ మొత్తం 125 మంది కార్పొరేటర్లను గెలిపించుకోవడం విశేషంగా మారింది. ఈ ఫలితాలు పట్టణ రాజకీయాల్లో ఎంఐఎం ప్రభావం పెరుగుతోందన్న సంకేతాలను ఇచ్చాయి.

ఈ విజయం నేపథ్యంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ సంతోషం వ్యక్తం చేశారు. తమపై నమ్మకం ఉంచి ఓట్లు వేసిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ఫలితాలను ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా అభివర్ణించిన ఓవైసీ, ఓటమి ఎదుర్కొన్న పార్టీలు ఇతరులను విమర్శించే ముందు తమ లోపాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన అవసరం అన్ని రాజకీయ పార్టీలకూ ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

పార్టీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లు ఎంఐఎంతోనే కొనసాగుతారని ఓవైసీ పూర్తి నమ్మకం వ్యక్తం చేశారు. వారి ఐక్యతను కాపాడేందుకు పార్టీ అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకుంటోందని, స్థానిక స్థాయిలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మున్సిపల్ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, త్వరలో జరిగే తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కూడా ఎంఐఎం దృష్టి సారించినట్లు ఓవైసీ వెల్లడించారు. ఆ ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ సిద్ధమవుతోందని, ఆసక్తి ఉన్న అభ్యర్థుల పేర్లను ఇప్పటికే కోరినట్లు తెలిపారు. మహారాష్ట్ర విజయంతో తెలంగాణలోనూ పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## 19న వెంకన్న స్వామి ఆర్జిత సేవల టికెట్ల విడుదల




**విశ్వంభర, ఏపీ బ్యూరో:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి భక్తుల సౌకర్యార్థం 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన వివిధ దర్శన, సేవా టికెట్ల కోటాను విడుదల చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) షెడ్యూల్‌ను ప్రకటించింది. శ్రీవారి ఆర్జిత సేవలు (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈటికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.

టికెట్ల బుకింగ్ కోసం భక్తులు కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ మాత్రమే సందర్శించాలని అధికారులు కోరారు. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## గోరంట్ల మాధవ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్..!!

**విశ్వంభర, ఏపీ బ్యూరో :** వైసీపీ నేతగా, మాజీ ఎంపీగా రాజకీయంగా గుర్తింపు పొందిన గోరంట్ల మాధవ్‌కు న్యాయస్థానంలో కీలక ఎదురుదెబ్బ తగిలింది. విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు ఆయనపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలికకు సంబంధించిన లైంగిక దాడి కేసులో అత్యంత సున్నితమైన వివరాలను బహిరంగంగా వెల్లడించారనే ఆరోపణలతో గోరంట్ల మాధవ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టు పలుమార్లు గోరంట్ల మాధవ్‌కు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. అయితే, నిర్ణీత తేదీలకు ఆయన కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. న్యాయ ప్రక్రియకు సహకరించని పరిస్థితి కొనసాగడంతో చివరకు పోక్సో ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సి వచ్చింది. ఇది కేసు విచారణలో కీలక మలుపుగా భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, తనపై జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను ఉపసంహరించాలంటూ గోరంట్ల మాధవ్ త్వరలోనే కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయనకు సన్నిహితంగా ఉన్న వర్గాలు వెల్లడించాయి. సోమవారం ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని సమాచారం. కోర్టు ఈ అభ్యర్థనపై ఎలా స్పందిస్తుందన్నది ప్రస్తుతం రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

ఈ కేసు తదుపరి దశలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో, గోరంట్ల మాధవ్ న్యాయపరంగా ఎలాంటి వాదనలు వినిపిస్తారో అన్న అంశాలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం

### ఇక్కడ కాదు, తమిళనాట

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, అన్నాడీఎంకే పార్టీ ఇప్పటికే రాజకీయంగా చురుకుగా మారింది. పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎంజీ రామచంద్రన్ 109వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి పార్టీ భవిష్యత్ దిశను స్పష్టంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆకట్టుకునే ఐదు కీలక హామీలను ఆయన ప్రకటించారు.

అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే సామాన్య ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకువస్తామని పళనిస్వామి హామీ ఇచ్చారు. అందులో భాగంగా పురుషులకు ఉచితంగా సిటీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ.2,000 ఆర్థిక సహాయం అందించే 'మగళీర్ కులవిళక్కు' పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. మహిళల ఆర్థిక భద్రతను బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు.

ఇళ్ల సమస్యపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వంత ఇళ్ల నిర్మాణం, పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల పంపిణీ ద్వారా పేదలకు నివాస భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎస్సీ జంటలకు ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి, సామాజిక న్యాయాన్ని మరింత బలపరుస్తామని తెలిపారు. మహిళల స్వావలంబన కోసం 'అమ్మ టూ వీలర్ స్కీమ్' కింద ఐదు లక్షల మంది మహిళలకు ద్విచక్ర వాహనాల కొనుగోలుకు రూ.25,000 సబ్సిడీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా పళనిస్వామి డీఎంకేపై విమర్శలు గుప్పించారు. గత ఎన్నికల్లో అన్నాడీఎంకే ప్రకటించిన పథకాలనే డీఎంకే కాపీ చేసి అమలు చేస్తోందని ఆరోపించారు. తమ పాలనలో ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధంగా నడిపామని, కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలు నిలిచిపోకుండా అందించామని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి అన్నాడీఎంకేకు అవకాశం ఇస్తే, మరింత బలమైన పాలన అందిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## భారీ మెజార్టీతో గెలిచిన ఖైదీలు అత్తాకోడళ్లు..!!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పూణె నగర రాజకీయాల్లో అరుదైన, సంచలన ఘటన చోటుచేసుకుంది. హత్య కేసులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న ఇద్దరు మహిళలు మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. లోకల్ గ్యాంగ్‌స్టర్‌గా పేరున్న బందు అందేకర్ కుటుంబానికి చెందిన సోనాలి, లక్ష్మి అనే అత్తాకోడళ్లు జైలులో నుంచే ఎన్నికల బరిలో నిలిచి ప్రజల తీర్పును తమవైపు తిప్పుకున్నారు.

ఈ ఇద్దరూ అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీ తరఫున పోటీ చేయగా, వారి తరఫున కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులు జైలులో ఉండటం, పైగా హత్య కేసులో నిందితులుగా ఉండటంతో ఎన్నికల ముందు నుంచే తీవ్ర రాజకీయ దుమారం రేగింది. హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు టికెట్లు ఇవ్వడంపై ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా, ఎన్సీపీకి మిత్రపక్షమైన బీజేపీ నేతలు కూడా అజిత్ పవార్‌పై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. అయితే ఈ విమర్శలన్నిటికీ భిన్నంగా ప్రజలు ఇచ్చిన తీర్పు రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది.

బందు అందేకర్ కుటుంబంలో గత కొన్ని సంవత్సరాలుగా హింసాత్మక ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. 2024 సెప్టెంబర్‌లో ఆయన కుమారుడు, మాజీ కార్పొరేటర్ వనరాజ్ హత్యకు గురయ్యాడు. ఆస్తి వివాదాలే ఈ హత్యకు కారణమని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. ఆ తర్వాత ఏడాది వ్యవధిలోనే వనరాజ్ కుమారుడు, బందు అందేకర్ మనవడు కూడా హత్యకు గురికావడం మరింత సంచలనంగా మారింది. ఈ తాజా హత్య కేసులో బందు అందేకర్ కోడలు సోనాలి, మరదలు లక్ష్మి పాత్ర ఉందని పోలీసులు గుర్తించి, వారితో పాటు మరో 16 మందిని అరెస్టు చేశారు. కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ప్రస్తుతం వీరంతా జైలులోనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఎన్నికల్లో గెలవడం పూణె రాజకీయాల్లో అపూర్వ సంఘటనగా నిలిచింది.





# రిపబ్లిక్ డేకు ఉగ్ర ముప్పు.. నిఘా వర్గాల హెచ్చరికలు

- దేశ రాజధాని ఢిల్లీలో హై అలర్ట్
- ఖలిస్థానీ, బంగ్లాదేశ్ శక్తుల కుట్ర
- గ్యాంగ్‌స్టర్లతో ఉగ్ర హ్యాండ్లర్ల చేతులు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో నిఘా వర్గాలు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. జనవరి 26న ఢిల్లీ సహా దేశంలోని ప్రధాన నగరాలే లక్ష్యంగా ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఐబీ నివేదిక వెల్లడించింది. ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థలు, బంగ్లాదేశ్‌కు చెందిన భారత్ వ్యతిరేక శక్తులు ఈ కుట్రకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం అందింది. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఉగ్ర హ్యాండ్లర్లు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. నేరుగా రంగంలోకి దిగకుండా, స్థానిక గ్యాంగ్‌స్టర్లను పావులుగా వాడుకుంటున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. హరియాణా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ ఉగ్ర నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తున్నట్లు సమాచారం. స్థానిక యువతను, నేరగాళ్లను రాడికల్ శక్తులుగా మార్చి దాడులకు పురమాయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఈసారి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ సరిహద్దులతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెంచాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆదేశించింది. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, కీలక ప్రభుత్వ కార్యాలయాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. పరేడ్ జరిగే పరిసర ప్రాంతాల్లో డ్రోన్లపై నిషేధం విధించడంతో పాటు సీసీ టీవీ నిఘాను ముమ్మరం చేశారు.

**అప్రమత్తంగా ఉండాలని సూచన**

అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రిపబ్లిక్ డే వేడుకలు ప్రశాంతంగా జరిగేలా త్రివిధ దళాలు, పారామిలటరీ దళాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

# ఆర్కిటెక్చర్ కోర్సు, కెరీర్ పై అవగాహన



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆర్కిటెక్చర్ విద్య, కెరీర్ అవకాశాల గురించి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించే లక్ష్యంతో, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026 వరకు పలు ఔట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహించింది. మదీనగూడలోని జెన్ సిస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చరల్ మోడల్స్, డ్రాయింగులు, ముఖాముఖి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే ఆచరణాత్మక, సృజనాత్మక అన్వేషణను ప్రోత్సహించే మందల ఆర్ట్ వర్కుషాపును కూడా నిర్వహించారు. మొత్తం 168 మంది జెన్ సిస్ విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ తరువాత, శ్రీ స్వామినారాయణ గురుకుల్ నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య బాలురు, బాలికల కోసం వరుస ఔట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఆర్కిటెక్చర్ విద్యపై ఆచరణాత్మక అవగాహనను, డిజైన్ ఆలోచనను పెంపొందించడంతో పాటు విభిన్న కెరీర్ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ గీతం ఆర్కిటెక్చర్ అధ్యాపకులు ఆర్.అభిషేక్ కుమార్ సింగ్, ఆర్.స్నిగ్ధరాయ్ సమన్వయం చేశారు.


## శంకర్‌పల్లి మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేద్దాం


### బీజేవైఎం అధ్యక్షుడు సానికే లోకేష్



**విశ్వంభర, శంకరపల్లి :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి శంకర్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకుంటామని బీజేవైఎం శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సానికే లోకేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహారాష్ట్రలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన ఘన విజయాలు దేశవ్యాప్తంగా పార్టీ బలాన్ని స్పష్టంగా చాటాయని అన్నారు. బాంబే, పూణే, నాగపూర్ వంటి ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు అనేక ప్రాంతాల్లో బీజేపీ విజయాలు సాధించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ విజయాల ప్రభావం తెలంగాణలోనూ, ప్రత్యేకంగా శంకర్‌పల్లిలో పార్టీకి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తోందని చెప్పారు. ప్రజల సమస్యలపై స్పష్టమైన దృష్టి, అభివృద్ధి పట్ల నిబద్ధతతో బీజేపీ ముందుకు సాగుతోందని అన్నారు. అదే విశ్వాసంతో మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కడతారని, శంకర్‌పల్లి గడ్డపై పార్టీ సత్తా చాటి మెజారిటీ స్థానాలు దక్కించుకుంటామని చెప్పారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : సర్పంచ్ శేఖర్ రెడ్డి





**విశ్వంభర చింతపల్లి:** గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. శనివారం తీదేడు గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద ఉన్న చెత్తను జెసిబితో తొలగించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్, మర్ల యాదగిరి యాదవ్, శివర్ల పర్వతాలుఅబశ్రీశ్రీ యాదవ్, సందె లక్ష్మయ్య, బిఆర్ఎస్ నాయకులు మర్రు రామారావు, వీరమల్ల వెంకటయ్య, గంటెల బాబు, సందె యేసు, సందె శంకర్, పంబాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో సిఎం కప్ టార్చ్ ర్యాలీ



**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో శనివారం సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ టార్చ్ ర్యాలీ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల ఎంపీడీఓ, మండల ఎస్సై , మండల విద్యాధి.కారి, మండల పంచాయతీ అధికారి, మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, పీ.ఈటీ లు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్రీడాజ్యోతి టార్చ్ ర్యాలీ జనవరి 8 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## సర్పంచులకు అవగాహన సదస్సు

**విశ్వంభర, వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, మండల పంచాయతీ అధికారి సయ్యద అర్జుమాన్ బాను నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ నెల 19వ తేదీ నుండి 23 వరకు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. అలాగే గ్రామ స్థాయి, మండల స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలపై చర్చించి, క్రీడల ద్వారా యువతను ప్రోత్సహించి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఈ నెల 19నుంచి 23 వరకు కొల్లూరులో దక్షిణ భారత సైన్స్ ఫెయిర్




**విశ్వంభర, సంగారెడ్డి జిల్లా :** ప్రతిష్టాత్మకమైన దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్--2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో, బెంగళూరులోని విశ్వేశ్వరయ్య పారిశ్రామిక సాంకేతిక విజ్ఞాన మ్యూజియం సహకారంతో ఈ సైన్స్ ఫెయిర్‌ను ఈనెల 19 నుండి 23 వరకు సంగారెడ్డి జిల్లా ఆర్‌సి పురం మండలం కొల్లూరులోని ది గాడియం పాఠశాలలో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన తొమ్మిదవ , పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం నిర్వహించే జోనల్ స్థాయి అత్యంత ప్రతిష్టాత్మకమైన వార్షిక విద్యా కార్యక్రమం దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ సైన్స్ మ్యూజియంల మండలి పర్యవేక్షణలో 1981--82 నుండి నిరంతరంగా నిర్వహిస్తున్నారు. చక్రీయ విధానంలో భాగంగా రెండువేల ఇరవై ఆరు సంవత్సరానికి ఈ ఫెయిర్ నిర్వహణ బాధ్యత తెలంగాణ రాష్ట్రానికి లభించింది. గతంలో రెండువేల పద్దెనిమిది సంవత్సరంలో తెలంగాణ ఈ సైన్స్ ఫెయిర్‌ను విజయవంతంగా నిర్వహించగా, రెండువేల ఇరవై ఐదు సంవత్సరంలో పుదుచ్చేరి ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చింది. సైన్స్ ఫెయిర్--రెండువేల ఇరవై ఆరు సందర్భంగా ప్రతి రాష్ట్రం , కేంద్రపాలిత ప్రాంతం నుండి ముప్పై ఐదు చొప్పున ప్రదర్శనలు ప్రదర్శించనున్నారు. వీటిలో పది విద్యార్థుల బృంద ప్రదర్శనలు, పదిహేను విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శనలు , పది ఉపాధ్యాయుల ప్రదర్శనలు ఉంటాయి. ఈ విధంగా మొత్తం రెండువందల పది ప్రదర్శనలు ప్రదర్శించబడనున్నాయి. ఈ ఫెయిర్‌లో రెండువందల పది మంది విద్యార్థులు , రెండువందల పది మంది ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన నమోదు ప్రక్రియ జనవరి పద్దెనిమిది తేదీన జరుగనుంది. జనవరి 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు ప్రదర్శనలు కొనసాగుతాయి. మొత్తం కార్యక్రమ వ్యవధి ఆరు రోజులుగా ఉంటుంది. విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, ఆవిష్కరణలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు ఈ ఫెయిర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, తర్కశక్తి, సృజనాత్మక ఆలోచన, అనుభవపూర్వక అభ్యాసం మరింతగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులకు కూడా నూతన బోధనా విధానాలు, శాస్త్రీయ నవీనతలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్ర విద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో తన స్థానాన్ని మరింత బలపరుచుకునే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. జనవరి 19నుండి23 వరకు ప్రతిరోజూ సమీప ప్రాంతాల నుండి సుమారు మూడు వేల నుండి నాలుగు వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలను సందర్శించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రవేశ ఏర్పాట్లు, జనసమూహ నియంత్రణ, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర మౌలిక వసతులను విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య పర్యవేక్షణలో, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్నారు. సైన్స్ ఫెయిర్‌కు విస్తృత ప్రజాదరణ కల్పించడంతో పాటు విద్యార్థుల శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో, జనవరి19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య ఘట్టాలు, విశిష్ట ప్రదర్శనలు , విద్యార్థుల వినూత్న ఆలోచనలను ప్రముఖంగా ప్రచురించాలని నిర్వాహకులు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కోరారు.

## ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యాలకు చేరాలి



### ■ అవగాహన సదస్సులో ఎస్పీ నరసింహ

**విశ్వంభర, సూర్యాపేట:** రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రతిఒక్కరూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవలనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు ల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం మహా ఉద్యమంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహ తెలిపినారు. ఆర్టీసీ డ్రైవర్లకు, లారి అశోషియేషన్ వారికి, టాక్సీ డ్రైవర్లకు, అంజనాపురి జంక్షన్, అంబేద్కర్ కాలనీ జంక్షన్ వినియోగదారులకు ఆర్టీసీ డిపో కార్యాలయం లో నిర్వహించిన రోడ్డు భద్రత, అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమానికి ఎస్పీ నరసింహ హాజరై మాట్లాడారు. జీవితం చాలా విలువైనది, జీవనానికి మరణానికి సార్ధకత ఉండాలి. రోడ్డు ప్రమాదాల బారిన మరణించే వారి సంఖ్య అధికంగా ఉంటుంది అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి అర్ధంతరంగా మరణిస్తే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి, తల్లిదండ్రులకు తోబుట్టువులకు దుఃఖాన్ని మిగులుస్తున్నారు అన్నారు. అర్వపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదాన్ని గుర్తు చేశారు, విధుల నిర్వహణలో పోలీసు సోదరులు రోడ్డు ప్రమాదాల బారినపడి చనిపోయిన సందర్భాలు గుర్తు చేశారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో వాహన డ్రైవర్ల పాత్ర కీలకంగా వుంటుందని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన " అరైవ్. అలైవ్" కార్యక్రమం లో పౌరులు, ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలతో పాటు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు చేయకూడని పనులపై ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆర్టీసీ ఉద్యోగులకు వివరించారు. దేశంలో ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందని, దీని కారణంతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం పొందటం కారణంగా కొన్ని కుటుంబాలు రోడ్డు పడ్డాయని అన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు, రోడ్లపై సూచిక బోర్డులను అనుసరించాలి, వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు, అతివేగంగా వెళ్ళవద్దు, తప్పుడు మార్గంలో వాహనాలు నడపవద్దు, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు అని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, ఎస్సైలు సాయిరాం, ఏడుకొండలు, మహేందర్ పాల్గొన్నారు.



## నాగారంలో సంక్రాంతి క్రీడోత్సవాల బహుమతి ప్రదానం

**విశ్వంభర, నాగారం :** సంక్రాంతి క్రీడోత్సవాలను పురస్కరించుకొని నాగారం మండల కేంద్రంలో ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం కబడ్డీ,వాలీబాల్, క్రికెట్ తోపాటుగా మహిళలకు ముగ్గుల పోటీల క్రీడలను నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు నాగారం సర్పంచ్ గుంటకండ్ల రామచంద్రారెడ్డి, గుంటకండ్ల సురేష్ రెడ్డి చేతుల మీదుగా క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతులను వాలీబాల్ రూ. 3000, రూ. కబడ్డీ-3000 అందజేశారు. వాలీబాల్ ద్వితీయ బహుమతులను నాగారం ఉపసర్పంచ్ వంగూరి అంజి యాదవ్ రూ. 2000కబడ్డీ ద్వితీయ బహుమతి రూ. 2000 ఎలుక కృష్ణ ఎలుక శ్రీధర్ లు అందజేశారు. క్రికెట్ ప్రథమ బహుమతి 3000 రూ నవతరం యూత్ సభ్యులకు బొబ్బలి లింగమల్లు, చిప్పలపల్లి అంజయ్య అందజేశారు. ద్వితీయ బహుమతి రూ. 2000 బరపాటి పర్శ,చిప్పలపల్లి వెంకన్నలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు ఎలుక సైదులు, సీనియర్ నాయకులు గంట నరసయ్య,మండల నాయకులు కూరం వెంకన్న, క్రీడాకారుల కమిటీ సభ్యులు కొమురెల్లి,పండు,అజయ్, చిన్ని,శంకర్,లింగస్వామి శోభన్,తదితరులు పాల్గొన్నారు.



## దర్గా ను సందర్శించిన బండి రమేష్

కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని అల్లాపూర్ దర్గా ను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇన్చార్జి బండి రమేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పటాన్ బర్కత్ అలీ ఆయనను శాలువాతో సత్కరించారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

## డిఎంహెచ్ ఓ శ్రీనివాస్



**విశ్వంభర, చింతపల్లి:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలం లోని ఘడియ గౌరారం పల్లె దవాఖానను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న వ్యాధి నిరోధక టీకాల వివరా లను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలను, ల్యాబ్ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట దేవరకొండ డిప్యూటీ డిఎంహెచ్వో డా.రాహుల్, చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఏఎన్ఎం ఆశలు వున్నారు.

## పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అరెస్టు

### పేకాటపై కఠిన చర్యలు తప్పవు : పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి

**విశ్వంభర జనవరి 17:** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ పట్టణంలో త్రిశూల్ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను పటాన్‌చెరు పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ వారి వద్ద నుంచి ?29,390 నగదు మరియు పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ, ఇకపై ఎవరైనా పేకాట ఆడుతూ పట్టుబడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.



# మున్సిపాలిటీ వార్డులకు రిజర్వేషన్లు ఖరారు

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా సాగిన ప్రక్రియ

**విశ్వంభర, సంగారెడ్డి :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని అందోల్ బి జోగిపేట్ , గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్ , జిన్నారం , కోహిర్, నారాయణఖేడ్, సదాశివపేట్, సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేసినట్లు అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు మాధురి, ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ పాండు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. జిల్లాలోని సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని 38 వార్డులకు, అందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులు, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు , ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డులకు, జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు, కోహిర్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు, నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు, సదాశివ పేట మున్సిపల్ పరిధిలోని 26 వార్డులకు, జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 37 వార్డు స్థానాల కోసం ఎస్.సి, ఎస్సీ(మహిళా), ఎస్.టి, ఎస్టీ(మహిళా), బి.సి, బీసీ(మహిళా), అన్ రిజర్వుడు, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీల రిజర్వేషన్లను నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి 1 వార్డు కేటాయించగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 3 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు ఖరారయ్యాయని అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. అదేవిధంగా బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు జనరల్ కేటగిరీకి 8 , అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 11 వార్డులు రిజర్వ్ అయ్యాయని వివరించారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డు కేటాయించినట్లు ఆమె వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 9, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 10 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. సదాశివపేట మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 5 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని చెప్పారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.జిన్నారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. కోహిర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3,




అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని చెప్పారు. గడ్డపోతారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.గుమ్మడిదల మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒకటి, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 5, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. ఇంద్రేశం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి మూడు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని చెప్పారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్‌రిజర్వుడ్ కేటగిరీలకు కేటాయించిన వార్డుల వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ చెప్పారు. మహిళలకు రిజర్వ్ చేసిన వార్డులను డ్రా విధానంలో ఎంపిక చేసి ప్రకటించినట్లు తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో జెడ్పి సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు ,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా రిజర్వేషన్ల ప్రక్రియ

■ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**విశ్వంభర,సూర్యాపేట:** గత ఎన్నికల రిజర్వేషన్ , ఎస్ టి, ఎస్ సి, బి సి జనాభా లెక్కలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రాజకీయ పార్టీ ప్రతినిధుల మధ్య రిజర్వేషన్లను పారదర్శకంగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సూర్యాపేట, కోదాడ,హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డులకు ఆయన రిజర్వేషన్ ప్రక్రియను శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వార్డుల వారీగా రిజర్వేషన్లు కేటాయించామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, మున్వర్ అలీ , రాజకీయ పార్టీ ప్రతినిధులు ,అధికారులు, సిబ్బంది,హాజరయ్యారు.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న బారాస నేత

**విశ్వంభర, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి బారాస సీనియర్ నేత చిరా రవీందర్ యాదవ్ బెజవాడ కనక దుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బారాస అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసి అత్యధిక సీట్లు గెలవాలని , అమ్మవారి కృప కటాక్షాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.



## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

**విశ్వంభర, తలకొండపల్లి:** తల కొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ 1993-94 పదో తరగతి బ్యాచ్ లో తమతో కలిసి చదువుకున్న స్నేహితుడి గంగన మోని మల్లేష్ మరణవార్త విని చలించిపోయిన తోటి స్నేహితులు అతని ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని అందరూ కలిసి డబ్బు పోగుచేసి అతని దినవారము రోజున ఆయన స్వగ్రామమైన కొత్తూర్ గ్రామానికి చేరుకొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు 60 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎం కృష్ణయ్య, డి అశోక్, ఎస్ చంద్రయ్య, ఎం జైపాల్, ఈ వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# బరితెగించిన మట్టి మాఫియా







■ మహేశ్వరం రెచ్చిపోతున్న మట్టి మాఫియా
■ నాగారంలో అక్రమంగా మట్టి తరలింపు
■ పట్టించుకోని రెవెన్యూ అధికారులు
■ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ఆందోళన

**విశ్వంభర. మహేశ్వరం :** మహేశ్వరంలో రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తూ మండలం కే బి తండా గ్రామంలో మట్టి లారీలు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో పక్కనే ఉన్న ఇంటి పై విద్యుత్ తీగలు పడ్డాయి తృటిలో భారీ ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు కానీ అక్కడున్న గ్రామ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బయట ప్రజలు ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి అయితే చాలు మట్టి లారీల సౌండ్ వినలేక పోతున్నామని తెలిపారు. మట్టి మాఫియా రెచ్చిపోతున్నా స్థానిక పోలీసులు కానీ రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కే బి తండాలో ఉప్పుగడ్డ తండాలో సీలింగ్ ల్యాండ్ గవర్నమెంట్ భూమిలో మట్టి దందా మాఫియాలు రెచ్చిపోతున్నారు. తండావాసులు రాత్రి అయితే చాలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని నిద్ర పోవాల్సి వస్తుంది. గతంలో ఎమ్మార్వోకు ఎన్నిసార్లు మట్టి మాఫియా గురించి చెప్పిన పట్టించుకోలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే మట్టి మాఫియా పై తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరుగుతే ఎవరు బాధ్యత వహిస్తారని ఎందుకు అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా ప్రభుత్వ భూముల మట్టిని తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మహేశ్వరం, నాగారం గ్రామంలో కూడా అక్రమంగా మట్టి మాఫియా ఆగడాలు జరుగుతున్నాయని వెంటనే అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఆమనగల్లు లో చక్రం తిప్పనున్న గిరిజనులు

**విశ్వంభర, ఆమనగల్లు:** మున్సిపాలిటీ పరిధిలోని గిరిజనుల జనాభా ఎక్కువ ఉన్న వార్డులు జనరల్ కు కేటాయించడం పట్టణంలోని ముఖ్యమైన వార్డులు ఎస్టీలకు కేటాయించడంతో గిరిజనులు మునిసిపాలిటీలో మెజారిటీ స్థానాలలో గెలిచి చక్రం తిప్పనున్నారు. . మున్సిపాలిటీలోని, ఒకటవ వార్డు చంద్రాయన పల్లి, మూడో వార్డు నచ్చుకుంట తండా ,తొమ్మిదో వార్డు విద్యానగర్ జనరల్ కు కేటాయించారు. కానీ ఇక్కడ జనాభాపరంగా గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. దీంతో ఇక్కడ మిగతావారు గెలిచే పరిస్థితి లేదు. అలాగే ఆరవ వార్డు గుర్రం గుట్ట, ఏడో వార్డు వెంకటేశ్వర కాలనీ, 11వ వార్డు ఆదర్శనగర్, 13వ వార్డు శ్రీనివాస్ కాలనీ ఎస్టీలకు కేటాయించడంతో ఇక్కడ గిరిజనులు ఎన్నికకానున్నారు. దీంతో 15 స్థానాలకు దాదాపు ఏడు స్థానాలు ఒకటి మినహాయించి గిరిజనులే గెలిచే అవకాశం కనబడుతుంది. గతంలో చైర్మన్ గా బిజెపి నుండి రాంపాల్ నాయక్ పనిచేశారు. ఈసారి చైర్మన్ పీఠం ఎవరిని వరించనుందో చూడాలి. కానీ బీసీలకు ఒకటే స్థానం కేటాయించడంతో బీసీల జనాభా




అత్యధికంగా ఉన్న ఆమనగల్లు మండలం సర్పంచ్ ఎన్నికల్లో, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేశారని బీసీలు మదన పడుతున్నారు. జనరల్ స్థానాల్లోనైనా బీసీలు నిలబడి చైర్మన్ స్థానాన్ని కొల్లగొట్టాలని చూస్తున్నారు.

## గవర్నర్ పర్యటన సందర్భంగా స్థల పరిశీలన

కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

విశ్వంభర, సూర్యాపేట : త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా కోదాడ లోని కె ఆర్ ఆర్ డీగ్రీ కాలేజీ స్థలం లో నిర్మించనున్న నూతన నవోదయ స్కూల్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కె ఆర్ ఆర్ డీగ్రీ కాలేజీ స్థలంలో నిర్మించనున్న నవోదయ స్కూల్ భవనం నిర్మాణానికి శంకస్థాపన సందర్భంగా అధికారులు ముందస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అప్రోచ్ రోడ్లు వేయాలని, శిలాఫలకం తయారు చేయించి అమర్చాలని, స్టేజి, శామియానాలు, ప్రోటోకాల్ ఏర్పాట్లు, గ్రౌండ్ చదును చేయించాలని, దుమ్ము లేవకుండా వాటర్ స్ప్రే చే యించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ సూర్యనారాయణ ఇంచార్జ్ డి ఆర్ డి ఏ పీడీ శిరీష,డీపీఓ



యాదగిరి, ,డి ఎస్ ఓ మోహన్ బాబు,,తహసీల్దార్ వాజీద్ అలీ,ఎం ఈ ఓ సలీం షరీఫ్,ఆర్ ఎ బి అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోనిపరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సర్పంచ్ షాహినా యాకూబ్ వలి

**విశ్వంభర, నాగారం :** గ్రామాన్ని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శాంతినగర్ సర్పంచ్ షేక్ షాహినా యాకుబ్ వలి అన్నారు. వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న కంప చెట్లను,మట్టిని తొలగించే కార్యక్రమంలో



పాల్గొని సర్పంచ్ మాట్లాడుతూ.. మన చుట్టుపక్కల ఉండే ఇంటి పరిసరాలలో ఉండే పిచ్చి మొక్కలను,కంపచెట్లను ఎవరికి వారే సతహాగా తొలగించుకొని గ్రామ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లెపాక మల్లయ్య,మైనారిటీ అధ్యక్షులు సైదులు,వార్డు మెంబర్లు కాలియ,సైదులు,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అక్బర్ షేక్,యూత్ అధ్యక్షులు బాష, అక్బర్ పాష ,జాను, సురేష్, హుస్సేన్, కరీం, శేఖర్, జాని, మైసయ్య, మదార్, నాగుల్ మీరా, సోమయ్య, మండల కో ఆర్డినేటర్ అక్బర్ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత జిపి వర్కర్ కుటుంబానికి చేయూత



**విశ్వంభర, నెల్లికుదురు :** మండలంలోని రత్తిరామ్ తండా గ్రామపంచాయతీ కార్మికుడు భూక్య రఘు ఇటీవల కన్నుమూశాడు.అదే తండాకు చెందిన ఉద్యోగులు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. రూ.18,600 నగదు అందజేసి చేయూతనిచ్చారు. సహాయం చేసిన వారిలో హెచ్ఎం గుగులోతు రాము, మోతిలాల్,లాలునాయక్, దేవీలాల్, రాజేందర్, సతీష్, రమేష్, వీరన్న, రమేష్, రవి, జీవన్,లాల్ సింగ్, హతిరామ్, అశోక్ సురేష్ లు ఉన్నారు. ఈ సందర్భంగా వేరు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతకు ఉన్నత చదువుల కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ లాల్, మాజీ సర్పంచి బిక్కు తదితరులు పాల్గొన్నారు.

vishvambhara 8_vishvambhara 8.qxd 1/17/2026 11:50 PM Page 1



# అంగరంగ వైభవంగా బండ జాతర ప్రారంభం

- కోనేరులో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు
- భక్తుల సౌకర్యార్థం కొత్తగా షవర్లు
- అందంగా ముస్తాబైన ఆలయాలు





**విశ్వంభర, సిద్దిపేట :** రూరల్ మండలంలోని పుల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బండ జాతర స్వామివారి రథయాత్రతో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. దేవస్థాన కమిటీ ఛైర్మన్ పుల్లూరు కనకయ్య గౌడ్, సర్పంచ్ లత వెంకట్ ఆధ్వర్యంలోఏర్పాట్లు పూర్తయ్యాయి. గుట్ట పైనున్న కోనేరు గుండానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. భక్తుల స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఈసారి కొత్తగా షవర్లు ఏర్పాటుచేశారు. కోనేరులో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పుల్లూరు బండ మీదున్న కోనేరులో శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అర్చకులు వేదమంత్రాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. 8 ఫీట్ల ఎత్తు శ్రేష్ఠమైన నల్ల రాతితో రూపొందించిన శ్రీకృష్ణుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. విగ్రహ దాత సర్పంచ్ కుంచం లత వెంకట్ యాదవ్ ను వేద పండితులు ఆశీర్వదించారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరిగే బండ జాతరను పురస్కరించుకుని దేవస్థాన కమిటీ ఛైర్మన్ కనకయ్య, సర్పంచ్ లత వెంకట్ భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లత మాట్లాడుతూ గ్రామ ప్రజల సేవలో ఉంటూ గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. గ్రామస్తులు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, పాడిపంటలతో బాగుండాలనే దృఢ సంకల్పంతో శుభాకార్యాలకు శ్రీకారం చూడుతున్నామ న్నారు. అనంతరం ఆలయ ఛైర్మన్ కనకయ్య మాట్లాడుతూ, సర్పంచ్, దేవస్థానం కమిటీ సభ్యుల సమన్వయంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాతర సందర్భంగా ఆలయంలోని వాలంటీర్లకు, పోలీస్ సిబ్బందికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.



# క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు

**విశ్వంభర, రామన్నపేట:** సంక్రాంతి పండుగ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల పరిధిలోని నీర్నెముల గ్రామంలో గ్రామ సర్పంచ్ కందిమళ్ళ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలను ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్ క్రీడలో ప్రథమ బహుమతి విజేతలుగా నిలిచిన సెవెన్ హిల్స్ జట్టు సభ్యులకు ఐదు వేల రూపాయలు నగదు బహుమతితో పాటు షీల్డ్ ను, అదే విధంగా ద్వితీయ బహుమతి పొందిన శ్రీఛత్రపతి శివాజీ యూత్ జట్టు సభ్యులకు 2,500 నగదు బహుమతితో పాటు షీల్డ్ ను, క్రికెట్ పోటీలో మొదటి బహుమతి పొందిన గల్లీ బాయ్స్ యూత్ జట్టు సభ్యులకు రూ.10,000 నగదు బహుమతితో పాటు షీల్డ్ ను, ద్వితీయ బహుమతి పొందిన శ్రీఛత్రపతి శివాజీ యూత్ జట్టు సభ్యులకు రూ.5,000 నగదు బహుమతితో పాటు షీల్డ్ లను నీర్నెముల గ్రామ సర్పంచ్ కందిమళ్ళ గోపాల్ రెడ్డి అందజేశారు. అలాగే ఇటీవల నీర్నెముల గ్రామ విద్యార్థి హాకీ విభాగంలో జాతీయ స్థాయిలో ఎన్నికయిన నోముల సుదర్శన్ కుమారుడు నోముల సాయి కుమార్ కు ప్రోత్సాహకంగా 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని, అదేవిధంగా తన వంతు సహాయ సహకారాలు నోముల సాయి కుమార్ఎ కు ల్లవేళలా ఉంటాయని, నీర్నెముల గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

# కాజిపల్లి లో అక్రమ నిర్మాణాల కూల్చివేత




**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మండలం కాజిపల్లిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 181లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. రెవెన్యూ, పోలీస్ , మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ కూల్చివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని నిబంధనలు ఉల్లంఘించి అక్రమ కట్టడాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల ఆర్ఐ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కల్వల మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

## ప్రిన్సిపాల్ పరిమి నవీన్

**విశ్వంభర,కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని కల్వల మోడల్ స్కూల్లో 6వ,తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పరిమి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ,తరగతిలో 100 సీట్లు, 7వ,తరగతి నుంచి 10వ, తరగతి వరకు మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ,పిహెచ్సీ,ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసి విద్యార్థులు రూ.200 చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ, తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 19 ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు,7వ,తరగతి నుంచి 10వ,తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# కిరాయి ఇళ్ల కష్టాలు నాకే ఎక్కువగా తెలుసు

## టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**విశ్వంభర, సంగారెడ్డి:** 22 సంవత్సరాలు కిరాయి ఇంటిలోనే ఉన్న.. అందుకే మీకు సొంత ఇంటి జా ఉండాలని ప్రయత్నం చేస్తున్నానని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి గంజ్ మైదాన్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 సంవత్సరంలోనే అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి సంగారెడ్డిలోని 5500 పేద ప్రజలకు 80 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇప్పించానని చెప్పారు. ఆ రోజు మీకు అలియాబాద్, తోగర్ పల్లిలో నేను ఇప్పించిన స్థలాలను బి.ఆర్.ఎస్ పదేళ్ల పాలనలో వేరే పనులకు తీసుకున్నారు. మీలో ఒక్కరైనా మీకు ఇచ్చిన స్థలాల గురించి పదేళ్లలో ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. అందుకే మళ్ళీ మీకు 80 గజాల స్థలం ఇవ్వడానికి సంగారెడ్డి, కంది మండలాల్లో 200 ఎకరాల స్థల సేకరణ చేయడానికి కలెక్టర్ తో కూడా మాట్లాడానని చెప్పారు. ఈ జనవరి నెల నుండే ప్రాసెస్ స్టార్ట్ చేస్తున్నానని, వచ్చే నవంబర్ వరకు ఒక కొలిక్కి తీసుకొస్తానన్నారు. భూసేకరణ కాగానే మళ్ళీ మీతో మీటింగ్ పెడతా సర్టిఫికెట్లు లేనో ల్లు సైతం మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తు చేసుకోండాని అన్నారు. వెయ్యి నోటు కోసం.. క్వార్టర్ సీసా కోసం మీ జీవితాలను ఆగం చేసుకున్నారు.. మళ్ళీ ఆగం కాకండని చెప్పారు. ప్రతీ నెల 5 వేల రూపాయలు ఇంటి కిరాయి చెల్లిస్తే.. ఏడాదికి 60 వేలు.. పదేళ్లకు 6 లక్షలు నష్టపోయారు. ఆరోజే మీరు ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఈ 6 లక్షల రూపాయలు మీకు మిగిలేవి కదా అని అన్నారు. నన్ను ఓడగొట్టారని నేను ఏనాడు బాధపడలేదు.. ఒక రకంగా మంచి పనే చేశారని అన్నారు. నేను ఓడిపోవడం వల్ల నా భార్య నిర్మల కార్పొరేషన్ చైర్మన్ అయ్యిందని తెలిపారు. ఇప్పుడు అధికారం లో ఉన్నా, నా మాట చెల్లుతది, సీఎం రేవంత్ రెడ్డి నేను చెబితే వింటడు అని అన్నారు.




# ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్




**విశ్వంభర, మాడ్గుల:** సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని నాగిళ్ల గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కి స్పాన్సర్లుగా సురమళ్ల సుభాష్ మొదటి బహుమతిగా పదివేల రూపాయలు , రెండవ బహుమతిగా ఆరు వేలరూపాయలు అందించారు. అదేవిధంగా షీల్డ్స్ అశోక్ గౌడ్, బాల్స్ నాగిళ్ల మహేష్ అందించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెడల్స్, మెమంటోలు అందించారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాజీ మార్కెట్ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్ మాట్లాడుతూ, క్రీడల తో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దృఢత్వం వస్తుందని అన్నారు. కష్టపడితే గ్రామీణ క్రీడాకారులకు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రస్తుత సమాజంలో నిత్యం ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతున్న సందర్భములో మానసికంగా బలంగా తయారయ్యే అవకాశం ఉందని అన్నారు. యువత చెడుమార్గంలో వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకొని తమ తమ కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ కంచనపల్లి సత్తయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ సురమళ్ల సుభాష్,వార్డు సభ్యులు బొల్లు కృష్ణ, బండ శ్రీనివాస్, నాయకులు డాక్టర్ వెంకటేశ్, అశోక్ గౌడ్, బందేల జగన్, నాగిళ్ల మహేష్, ప్రవీణ్ రెడ్డి మరియు ఆర్గనైజర్లు రమేష్ యాదవ్, వంశీ, శ్రీధర్, శివ స్టార్, సాయి, కార్తీక్, నెహ్రూ, నవీన్, కార్తీక్ , క్రీడాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్దే లక్ష్యం : సర్పంచ్ లక్ష్మమ్మ



**విశ్వంభర. మహేశ్వరం :** మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కె. కె బస్తీ లో సీ. సీ రోడ్డు ను సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో. గ్రామ ఉప సర్పంచ్ పులిమామిడి జనార్ధన్ గౌడ్, సర్పంచ్ తనయుడు బక్కని రవి, మాజీ సర్పంచ్ థామస్ రెడ్డి, వార్డు సభ్యులు తిరుమలి యాదయ్య, ఎర్ర భాను ప్రసాద్, బొజ్జం మల్లేష్ యాదవ్, బొజ్జం శ్రీనివాస్,గుడెపు కుమార్, బొజ్జం శివకుమార్ , కొండని శేఖర్. గ్రామ పెద్దలు ఆరడి వెంకటేష్ యాదవ్గా, దె శౌరెడ్డి.పల్లెర్ల ఆరోగ్య రెడ్డి, గాదె లూర్దు రెడ్డి, పల్లెర్ల రాజప రెడ్డి, తుమ్మ ప్రశాంత్ రెడ్డి, తుమ్మఇన్న రెడ్డి, గాదె వినోద్ రెడ్డి. గాదె బాల్ రెడ్డి,పల్లెర్ల చిన్నపు రెడ్డి బక్కని అశోక్. జగన్,కృష్ణ. శంకరయ్య. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్(డి) కి టెలిఫోన్ గుర్తు



**విశ్వంభర, బషీర్ బాగ్:** టిఆర్ఎస్ (డి) పార్టీ కి టెలిఫోన్ గుర్తు ను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలిపారు. టిఆర్ఎస్ (డి) పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పిటిసి, జిహెచ్ఎంసి ఎన్నికల్లో సైతం టిఆర్ఎస్ ( డి) పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. టిఆర్ఎస్ ( డి) యువత ను మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ ముందుకు వెళు తుందని అన్నారు.

# 20న విద్యుత్ గ్రీవెన్స్ డే

**విశ్వంభర, సిద్దిపేట :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20తేదీన జిల్లా కేంద్రంలోని సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం సభ్యుల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని సిద్దిపేట ఎస్ఈ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఫిర్యాదు చేసేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, జిరాక్స్ కూడా అవసరం లేదని పేర్కొన్నారు. తెల్ల కాగితంపై ఫిర్యాదు చేసే ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ రూరల్ టీజీఎస్పీడీసీఎల్ హైదరాబాద్ నుంచి రామానుజ నాయక్ హాజరవుతారని చెప్పారు.

# జర్నలిస్ట్ శ్రీనివాస్ మృతి తీరనిలోటు




**విశ్వంభర, నెల్లికుదురు:** సీనియర్ జర్నలిస్ట్ మద్దెల శ్రీనివాస్ గౌడ్ మృతి తీరని లోటని నెల్లికుదురు మండలం జర్నలిస్టులు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం మృతి చెందారు. మండల కేంద్రం నెల్లికుదురు లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి శ్రీనివాస్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నెల్లికుదురు పులి వెంకన్న,యాసం రమేష్,వివిధ పార్టీల నాయకులు హెచ్ వెంకటేశ్వర్లు,యాసం రమేష్,పెరుమాండ్ల బాబు గౌడ్,వరిపెల్లి వెంకన్న,పత్తిపాక తిరుపతా చారి,జర్నలిస్టులు బొడ్డు అశోక్,పంజాల వాసుదేవ గౌడ్,పెరుమాండ్ల చంద్రమౌళి గౌడ్, బొలగాని యాకన్న గౌడ్ ,గొల్లపల్లి విజయ్ బాబు ,హెచ్ మహేందర్, మల్యాల నరసయ్య, లెక్చరర్ గొట్టిముక్కుల వెంకటరెడ్డి,తదితరులు మాట్లాడుతూ శ్రీనివాస్ మానవీయకోణంలో సమాజంలో దాగి ఉన్న సమస్యలను తన కలం ద్వారా బయటపెట్టే వారన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జగన్, మస్కపురి సుధాకర్, నగేష్, రమేష్, చదల యాకాంతం, నాయకులు కృష్ణయ్య, రాస వెంకటరెడ్డి, మౌనేందర్, చట్ల యాకయ్య, చందు రాజకుమార్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్ట్ శ్రీనివాస్ గౌడ్ మహాప్రస్థాన యాత్రకు వందలాది మంది తరలివచ్చారు.

# ఎంపీడీవో ఎమ్మార్వో పై స్పెషల్ ఆఫీసర్ ఆగ్రహం

### ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఆవేదన



**విశ్వంభర, నిజామాబాద్ జిల్లా :** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కేంద్రంలో క్రీడా ఉత్సవాల్లో స్కూల్ టీచర్లు కాగడ వెలిగించడంతో ఎంపీడీవో పై స్పెషల్ ఆఫీసర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్ తిరుమలరావు మాట్లాడుతూ, ఇక్కడ అధికారులు కనీస గౌరవం ఇవ్వటం లేదని స్పెషల్ ఆఫీసర్లను పిలిపించి అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడలలో పాల్గొనేందుకు యువత ముందుకు రావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు ముందుకు రండి, మైదానంలోకి రండి క్రీడల వైపు దృష్టి పెట్టండి మద్యం వైపు చూడకండి అని ఆయన అన్నారు. ఎమ్మార్వో రేఖ, నాయక్ మోపాల్ మండలం లోని యువకులు క్రీడా ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆమె కోరారు. సీఎం కప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఎంపీడీవో రాములు నాయక్ మాట్లాడుతూ, సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దన్నారు. దీంట్లో గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్లు ప్రజాప్రతినిధులు యువత ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహించి యువకులని మంచి క్రీడాకారులుగా తీర్చి దిద్దాలన్నారు. ఎస్సై సుస్మిత ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆమె కోరారు. మీరు మీ గమ్యస్థానానికి క్షేమంగా వెళ్లాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని వాహనం నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలి పిలుపునిచ్చారు. మోపాల్ గ్రామ సర్పంచ్ రవి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి యువతను ప్రోత్సహిస్తూ క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకే సీఎం కప్ నిర్వహిహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు ఉపసర్పంచులు రామ గౌడ్, కులాస్పూర్ ఫోరం ఉప అధ్యక్షుడు, సర్పంచ్ జలంధర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు. ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**విశ్వంబర, దోమ:** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి పట్టణంలో దోమ మండల పరిధిలోని గొట్లచేల్క తండ గ్రామానికి చెందిన సభావాత్ తుల్యా కు 1.75 లక్షల రూపాయలు, పట్లవత్ సంతోష్ కు లక్ష రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని అన్నారు. పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు పాత్లవత్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఒమాన్ చేరుకున్న భారత నౌక 'కౌండిన్య'

### సముద్ర వారసత్వానికి గౌరవం



**విశ్వంభర, హైదరాబాద్ :** భారత నౌకాదళానికి చెందిన సాంప్రదాయ పడవ ఐఎన్ఎస్వి కౌండిన్య 17 రోజుల ప్రయాణం పూర్తి చేసి ఒమాన్‌లోని మస్కట్‌కు చేరుకుంది. గుజరాత్‌లోని పోర్బందర్ నుంచి డిసెంబర్ 29న ప్రారంభమైన ఈ ప్రయాణం, భారతదేశం--ఒమాన్ మధ్య ప్రాచీన సముద్ర సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. అజంతా గుహల గోడచిత్రాల ప్రేరణతో, ఆధునిక లోహాలు లేకుండా కుట్టిన పద్ధతిలో నిర్మించిన ఈ నౌక, భారతదేశపు స్వదేశీ నౌక నిర్మాణ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఇంజిన్, జిపిఎస్ విద్యుత్ సౌకర్యాలు లేకుండా, గాలి శక్తిపై మాత్రమే ఆధారపడి సాగిన ఈ ప్రయాణం భారత సాంస్కృతిక వారసత్వం, సముద్ర జ్ఞానానికి ఒక గొప్ప నిదర్శనంగా నిలిచింది.



# పర్వతగిరిలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం

**విశ్వంబర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని శనివారం పర్వతగిరి గ్రామంలో ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చల్ల అనిత వెంకటేశ్వర్లు , మహబూబాబాద్ మండలం వ్యవసాయ శాఖ అధికారి తిరుపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు గురి కావద్దన్న ఉద్దేశంతోనే రైతులు కోరిక మేరకు పర్వతగిరి గ్రామంలో వ్యవసాయ శాఖ సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఎల రైతులకు యూరియా ఎప్పుడు అంటే అప్పుడు వ్యవసాయ సహకార కేంద్రం వద్దకు వచ్చి తీసుకు వెళ్ళొచ్చని తెలిపారు. అంతేకాకుండా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పూస పెల్లి గ్రామంలో కూడా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి గ్రామ రైతులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# ఆడిట్ పేరుతో నిలువు దోపిడీ

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు వార్డు మెంబర్లు, సర్పంచులు ఓడిన అభ్యర్థులు వార్డు మెంబర్లు సర్పంచ్ లకు రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కార్యాలయం నుంచి ఆడిట్ పేరుతో ఒక్కొక్క వార్డు మెంబర్ నుంచి, సర్పంచ్ అభ్యర్థి నుంచి 500 మొదలు అయిదు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని గెలిచిన, ఓడిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ లబోదిబోమని అంటున్నారు. మేమెందుకు డబ్బులు ఇవ్వాలి అని గెలిచిన, ఓడిన అభ్యర్థులు అంటున్నారు. నేటికైనా ఉన్నత అధికారులు వాస్తవాలు తెలుసుకొని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బోరు మరమ్మతు చేయించిన మాజీ కౌన్సిలర్

**విశ్వంభర, పరిగి:** మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని ఖాన్ కాలనీ, బీసీ కాలనీలో బోరు చెడిపోవడంతో కాలనీవాసులు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ కాలనీలో పర్యటించి బోరు మరమ్మతు పనులను దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీవాసులకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉండి, ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డులో ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటినుంచే ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మాజీ కౌన్సిలర్ చొరవతో బోరు మరమ్మత్తు పూర్తికావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సాయిలుసార్ , శ్రీకాంత్, ఉస్మాన్ తో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్




**విశ్వంబర, మహబూబాబాద్ జిల్లా :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంథారం గ్రామంలో స్థానిక నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ క్యాంప్ శనివారం ముగిసింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ జగదీష్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజులుగా చేస్తున్న శ్రమదానం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు శ్రమ విలువను సేవా భావాన్ని పెంచినాయని అన్నారు. అంతేకాకుండా వాలంటీర్లు ఎన్ ఎస్ ఎస్ ద్వారా నాయకత్వ లక్షణాలు సాధించటానికి అవకాశం ఉందని గుర్తు చేశారు . మరియు గ్రామ పెద్దలు యువత మరియు ప్రజలు సహకారం మీకు మీ పనులకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చిందని , ప్రతిరోజ అవగాహన తరగతులు మీలో విజ్ఞానాన్ని పెంచటమే కాకుండా చదువుపై ఆసక్తి కల్గించినాయని అన్నారు . ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలిచిన వారికి పాల్గొన్న వారికి అభినందనలు తెలియజేసి బహుమతులను ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో అనంతరం గ్రామ ఐదో వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోడి శ్రీనివాస్ , మాజీ ఎంపీటీసీ బూర్ల ప్రభాకర్ , మాజీ సర్పంచ్ వీరు నాయక్ , పాఠశాల హెడ్ మాస్టర్ రాజేందర్ , అయ్య విజయ్ కుమార్ ఆచార్యులు ఇమ్మడిశెట్టి సీతారాములు నాగేళ్ల మురళి నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ దోలి సత్యనారాయణ , నలంద విద్యాసంస్థల ప్రిన్సిపాల్ లు , పద్యపాక బృందం అనంతథారం గ్రామస్తులు ,వాలంటీర్లు పాల్గొన్నారు.

# కారాగారాలు పరివర్తనాలయాలుగా ఉండాలి

### జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ



**విశ్వంబర, మహబూబాబాద్:** కారాగారాలు పరివర్తనాలయాలుగా ఉండాలని జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని సబ్ జైలుని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విచారణ ముద్దాయిలతో మాట్లాడుతూ ఒకసారి నేరారోపణ ఎదుర్కొంటూ జైలుకు వచ్చినవారు మళ్లీ అటువంటి నేరాలకు పాల్పడవద్దని సత్ప్రవర్తనతో బుద్ధిగా జీవించాలని చెప్పారు. అంతేకాకుండా సామాజిక ఆర్థిక ఇతర కారణాలతోనైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి న్యాయసేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు . నేరారోపణ ఎదుర్కొంటూ జైలులో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ స్పృహ అనే పథకాన్ని తీసుకువచ్చిందని వివరించారు. ఈ పథకం కింద విచారణ ముద్దాయిల కుటుంబ సభ్యులకి ఏదైనా న్యాయపరమైన సహాయం అవసరమైనట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుతుందన్నారు . ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజ్ కృష్ణ, పారా లీగల్ వాలంటీర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు .

# ప్రజాస్వామిక విలువలు పెంపొందించాలి




### ప్రొఫెసర్ శ్రీనివాసులు

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** విశ్వవిద్యాలయాలు సామాజిక సమస్యల పరిష్కారానికి, ప్రజాస్వామిక విలువలు పెంపొందించేందుకు ఏర్పాటైన వేదికలని, కానీ నేటి పాలకుల విధానాలు వాటిని కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా తీసుకెళ్తున్నాయని ప్రొఫెసర్ కే శ్రీనివాసులు అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రోహిత్ వేముల అమరత్వానికి 10 ఏళ్ల యిన సందర్భంగా ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు వేముల ఘటన నేపథ్యంలో దళిత విద్యార్థులను నిందితులుగా ముద్ర వేసే ప్రయత్నాలు ఆపాలని, కుల వివక్షకు వ్యతిరేకంగా 'రోహిత్ చట్టం' అవసరమని పిలుపునిచ్చారు. దళిత--బహుజన విద్యార్థులపై కొనసాగుతున్న కుల అణిచివేతకు వ్యతిరేకంగా, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రజాస్వామిక విలువలు అమలు కావాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ వి రఘునాథ్ మాట్లాడుతూ రోహిత్ వేముల సమస్యను బాధిత దళిత విద్యార్థులపై నిందలు మోపేలా మార్చడం సరికాదని, విశ్వవిద్యాలయాల్లో కుల అణిచివేతను అడ్డుకునే చట్టపరమైన చర్యలు అవసరమని అన్నారు. ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ కె వై రత్నం, ప్రొఫెసర్ జి విజయ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సమతా కేంద్రాలుగా మారాలని, శాస్త్రీయ విద్య, పరిశోధనలకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జి సరోజన, ఎర్ర మోహనకృష్ణ, జే చక్రవర్తి , దళిత ప్రజాసంఘాల నేతలు, ప్రొఫెసర్లు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి




**విశ్వంభర, సిద్దిపేట :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్, గజ్వెల్--ప్రజ్ఞాపూర్, చేర్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్ ప్రక్రియను శనివారం కలెక్టరేట్ లో కలెక్టర్ హైమావతి అధ్యక్షతన జిల్లాలోని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ మున్సిపాలిటీలో 50శాతం స్థానాలను మహిళలకు రిజర్వేషన్ కల్పించినట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్‌లను డ్రా పద్ధతిలో ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులు ప్రదానం




**విశ్వంభర,ఇనుగుర్తి:** క్రీడా పోటీలతో క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభ వెల్లడవుతుందని ఎస్సై కరుణాకర్ అన్నారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని మండల కేంద్రం ఇనుగుర్తి లో నిర్వహించిన ముగ్గులు,షటిల్, క్యారెమ్ బోర్డు,పరుగు పందెం పోటీలకు ఎస్సై, సర్పంచ్ తమ్మడపల్లి కుమార్ హాజరయ్యారు. .అనంతరం ఎస్సై కరుణాకర్,సర్పంచ్ కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సైని యూత్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి సత్తురి యాదగిరి,మోట మారి యాకసాయిలు,నాగెల్లి వెంకన్న,రమేష్,పప్పుల వెంకన్న,బూర మహేందర్,వెంకయ్యగారి మధు, చిన్నాల కట్టయ్య, ఎనమల యాకయ్య, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ బాధ్యులు దార్ల భాస్కర్, మధు ,కోటి,భరణి,ఆశోక్,సురేష్,సాయి కిరణ్,సంజీవ తదితరులు పాల్గొన్నారు.


# కందుకూరులో రోడ్డు భద్రత పై అవగాహన




**విశ్వంభర కందుకూరు:** మండలం ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో కొత్తగూడ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, శిక్షలు చట్టపరమైన చర్యలపై ప్రజలకు వివరించారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే జరిమానాలు, జైలు శిక్షలు, సామాజిక సేవ విధించే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. అలాగే హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించడం ఎంత ముఖ్యమో వివరించారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం, రాంగ్ రూట్లో వెళ్లడం, ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేయడం, అధిక వేగంతో వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటి చర్యల వల్ల జరిగే తీవ్ర పరిణామాలను ప్రజలకు వివరించారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం, జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, కల్పబుల్ హోమిసైడ్ కేసుగా నమోదు చేసి చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారు ప్రభుత్వ ఉద్యోగులైతే, కోర్టు శిక్ష పడిన సందర్భంలో విధుల నుండి సస్పెండ్ చేయబడతారని స్పష్టం చేశారు.అదేవిధంగా సురక్షితంగా రోడ్డు దాటడం, లేన్ క్రమశిక్షణ పాటించడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజువల్ ఎయిడ్స్, పోస్టర్లు సాధ్యమైన చోట్ల ప్రత్యక్ష ప్రదర్శనలు ద్వారా ప్రజలకు సందేశం చేరవేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడుకోవచ్చని ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, ఎస్ హెచ్ ఓ సీతారాం, ట్రాఫిక్ ఎస్ఐ పాండు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొడవలి పదును తగ్గిందా?

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత జయంతి ముగింపు ఉత్సవాలకు కమ్యూనిస్టుల ఎర్రకోట ఖమ్మం ముస్తాబైంది. ఆదివారం నాడు (2026 జనవరి 18) ఖమ్మం ఖిల్లా ఎరుపెక్కనుంది. నూరేళ్ల పండక్కి జనం ప్రత్యేకించి కమ్యూనిస్టు శ్రేణులు బాగానే కదం తొక్కనున్నాయి. శత వార్షికోత్సవాల ర్యాలీ తర్వాత మూడు రోజుల పాటు జరిగే సీపీఐ జాతీయ సమితీ సమావేశాలు, ఇతర కార్యక్రమాలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎం.ఏ.బేబీ సహా 40 దేశవిదేశాలకు చెందిన వామపక్ష పార్టీల నేతలు పాల్గొనబోతున్నారు. ఇవన్నీ ఎలా ఉన్నా, కాలపరీక్షకు తట్టుకుని ప్రస్తుత సంక్షోభ సమయంలో రెపరెపలాడుతున్న సీపీఐ, ఈ ముగింపు సభ నుంచి ఏమి పిలుపివ్వబోతోందన్నది ఇప్పుడు అందరూ ఎదురూ చూస్తున్న అంశం.






**సుసంపన్న చరిత్ర...**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి సుసంపన్న చరిత్ర ఉంది. 1917 నాటి రష్యా విప్లవం ప్రపంచాన్ని కుదిపేసింది. ఆ విప్లవ కెరటాలు...

నదీనదాలను, హిమాలయాలను దాటి బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశాన్నీ తాకాయి. వందేళ్ల కిందట ఆంగ్లేయుల పాలన కాలంలో భారతదేశంలో పరస్పర విరుద్ధమైన రెండు సిద్ధాంతాలు సంస్థల రూపంలో అవతరించాయి. ఒకటి భారత కమ్యూనిస్టు పార్టీ మరొకటి - రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. దేశ విముక్తి పోరాటంతో ఏ సంబంధం లేని ఆర్. ఎస్ ఎస్ ఈరోజు అసాధారణ శక్తిగా ఎదగ్గా త్యాగాల పునాదుల మీద పుట్టిన సీ. పీ.ఐ తుపానులో చిక్కిన నావలా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది.

ఈ విరుద్ధ గమనాల మధ్య సీపీఐ వందేళ్ల ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకోవడం, ముమ్ముందు ఏమి చేయాలనుకోవడమే ఇక్కడ ప్రధానం. చరిత్రకారుడు సుమిత్ సర్కార్ చెప్పినట్టు భారత కమ్యూనిజం వేర్లు జాతీయ ఉద్యమం నుంచే పుట్టాయి. 1924,25ల నాటికి భారతదేశంలో

ఒక బలమైన వామపక్ష ధార ఉద్భవించింది.

1925 కాన్పూర్ డిసెంబర్ 26 నుంచి 28 జాతీయ సదస్సు నిర్వహించాలని బొంబాయికి చెందిన శ్రీపాద్ అమృత్ డాంగే, విప్లవకారుడు సత్యభక్త్ లాంటి వాళ్లు అనేకమంది అనుకున్నారు. దాదాపు 500 మంది ప్రతినిధుల సమక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అధికారికంగా అవతరించింది.

మౌలానా హస్రత్ మోహాని మాటల్లో - "కమ్యూనిజం రైతులు, కార్మికుల ఉద్యమం. సంపూర్ణ స్వాతంత్ర్యమే మా లక్ష్యం." లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం హడలెత్తింది. 'బోల్షెవిక్ ప్రమాదం'పై నిఘా పెరిగింది. కాన్పూర్, మీరట్, లాహోర్, పెషావర్ కుట్రకేసులు, అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, కోర్టులు, కఠినకారాగార శిక్షలు, నిషేధాలు షరా మామూలయ్యాయి.

లాహోర్ కేసులో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు ఉరి కంభం ఎక్కారు. ఉరి తప్పించుకున్న అజయ్ ఘోష్ ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. కమ్యూనిస్టు అనుబంధ సంస్థలు ఏ. ఐ. టీ.యూ.సీ , కిసాన్ సభ, ఐ. పీ.టీ.ఏ, ఏ. ఐ. ఎస్.ఎఫ్ వంటివి అనేకం పుట్టాయి. వామపక్ష ఆలోచనలు దేశమంతా విస్తరించాయి. సీపీఐ అగ్రనేత పీసీ జోషి చెప్పినట్టు "జాతీయ పోరాటమే అతిపెద్ద వర్గ పోరాటం" అయింది. స్వాతంత్ర్యం సిద్ధించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉవ్వెత్తున సాగి ఆగింది. 1951-52 పార్లమెంటు ఎన్నికలు వచ్చాయి. సీ.పీ.ఐ దేశంలో రెండో పెద్ద పార్టీ. ఇక అధికారమే తరువాయి అనుకునే దశ.. కుట్రలు, కుతంత్రాలు మొదలు.. 1964 వరకు 3 లోక్‌సభల్లో ప్రధాన ప్రతిపక్షం సీపీఐ. 1957లో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం.. ప్రపంచం నివ్వెరపోయింది. 1959లో కేరళపై కాంగ్రెస్ కుతంత్రం..ఈ ఎమ్ ఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వం బర్తరఫ్. రాష్ట్రపతి పాలన.

కమ్యూనిస్టు పార్టీ ఆలోచనా ధోరణుల్లో మార్పు మొదలైంది. మార్క్స్., ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో.. మొదటి ముగ్గురు అందరికీ ఓకే.. చివరి రెండింటిలో తేడా.. వ్యూహాల మార్పు.. నిషేధాల మధ్య పార్టీ సభ్యత్వ పతనం.

**పార్టీలో తొలి చీలిక...**

1964లో సీ.పీ.ఐ మహా చీలిక, సీ. పీ. ఐ(ఎమ్) అవతరణ జరిగింది. 1990లలో సోవియట్ యూనియన్ పతనం నాటికే ఇండియాలో కమ్యూనిస్టు పార్టీలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడా పరిస్థితి మరింత తీవ్రస్థాయికి చేరింది. బీహార్, బెంగాల్, ఆంధ్ర, తెలంగాణ వంటి కమ్యూనిస్టు కోటలు బదాబదలయ్యాయి. అసెంబ్లీలలో ప్రాతినిధ్యమే కరవైంది. కేరళలో సీపీఎం అధికారంలో ఉంటే సీపీఐ భాగస్వామిగా మిగిలింది.

ఓ సిద్ధాంతాన్ని నమ్ముకున్న పార్టీని ఎన్నికల సంఖ్యలతోనే కొలవాలా? అవసరం లేకపోవచ్చు గాని బలపడాల్సిన అవసరమైతే ఉంటుంది.

కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గబట్టే ఇవాళ మతోన్మాద, సంకుచిత, విధ్వంసకర శక్తులు విజృంభించాయనేది నిజం. వాటిని కట్టడి చేయాల్సిన కమ్యూనిస్టులు ఇవాళ కురచబారిపోయారు. సకాలంలో నిర్ణయాలు తీసుకోలేక అనేక సార్లు చారిత్రక తప్పిదాలు చేశామని బహిరంగంగా చెప్పుకోవాల్సిన స్థితి..

**వామ–ప్రజాస్వామ్య ఐక్యత**: ఒక వ్యూహం, ఒక వాదన

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన చీలికలు పీలికలైన కమ్యూనిస్టులు ఇప్పుడు చెబుతున్న మాట వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత. కొత్తదేమీ కాదు. 45,50 ఏళ్లుగా వింటున్నదే. కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, కొన్ని మార్క్సిస్ట్, లెనినిస్టు గ్రూపుల రాజకీయ ఆలోచనల్లో ఇదో వ్యూహాత్మక, సైద్ధాంతిక కార్యాచరణ భావన.

ఈ "వామపక్ష-ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత" అంటే ఏమిటి? ఇది ఎన్నికల ఒప్పందమా? ప్రజా ఉద్యమాల సమాహారమా లేక దేశ రాజకీయ దిశను మార్చాలనే వ్యూహమా? దేశంలో వామపక్ష భావజాలం ఉన్న ప్రజాస్వామ్య-లౌకిక శక్తులన్నిటిని ఒక తాటిపైకి తెచ్చి కూటమిగా ఉంచడం దీని లక్ష్యం. ఎన్నికలప్పుడే కాకుండా ఇతరత్రా ఉద్యమాల్లోనూ కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో సమైక్య సామాజిక ఉద్యమాలు నిర్వహించడం ఉద్దేశం.

**ఈ ఐక్యత లక్ష్యాలు ఏమిటి?**

మొదటిది దేశంలో బూర్జువా-భూస్వామ్య పార్టీల ఆధిపత్యాన్ని ఎదుర్కోవడం. వీటి ప్రైవేటీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రతిఘటించడం. రెండోది సామాజిక దోపిడీకి, మతతత్వ రాజకీయాలపై పోరాటం, ప్రత్యేకంగా ఆర్. ఎస్. ఎస్‌బీజేపీ ముందుకు తెచ్చిన హిందుత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడడం. కుల, మత, లింగ వివక్ష, అసమానత వంటి సమస్యలను రాజకీయ అజెండాగా మార్చడం.

మూడోది సామాజిక న్యాయం, లౌకికత్వం, భూ సంస్కరణలు, కార్మిక హక్కులు, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం వంటి సమస్యలపై పోరాడడం. ప్రజాస్వామ్య విప్లవం లేదా సామ్యవాద సమాజం వైపు దేశాన్ని నడిపించడం లక్ష్యం.

ఈ ఐక్యత కేవలం ఎన్నికల కోసమే కాదు. ఎన్నికలు లేనప్పుడు కూడా నిరంతర ప్రజా పోరాటాల ద్వారా కింది స్థాయిలో వివిధ సామాజిక శక్తుల సమతుల్యతను కాపాడడమే దీని లక్ష్యం. ఇందులో పాల్గొనే వామపక్ష పార్టీలు తమ సొంత సిద్ధాంతాలను, గుర్తింపును కాపాడుకుంటూనే ఇతర ప్రజాస్వామ్య శక్తులతో సహకరిస్తాయి.

1988లలో "వామపక్ష, లౌకిక శక్తుల ఐక్యత", తర్వాత "వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యత", యునైటెడ్ ఫ్రంట్ పతనం తరువాత "మూడో ప్రత్యామ్నాయం", ఇప్పుడు ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లుజివ అలయన్స్) కూటమి. జాతీయస్థాయి ఫ్రంట్ లతో పాటు రాష్ట్రాలలోనూ వేర్వేరు కూటములు ఉన్నాయి. కేరళలో ఎల్.డి.ఎఫ్, బెంగాల్, త్రిపురలో ఎల్.ఎఫ్. (లెఫ్ట్ ఫ్రంట్), బీహార్ లో మహాఘటబంధన్, తమిళనాడులో లౌకిక ప్రగతిశీల శక్తుల సంఘటన , మణిపూరులో Manipur ప్రొ గ్రేసివ అలయన్స్ , మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ , ఆంధ్రాలో లెఫ్ట్ ఫ్రంట్ అని ఓసారి, తృతీయ ఫ్రంట్ అని మరోసారి, తెలంగాణలో సీపీఎం వారి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీ ఎల్ ఎఫ్) ఇందులో సీపీఐ లేదు, ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ తో పొత్తు)..

ఈ ప్రయాణమంతా సులువు కాదు...

నిజంగానే ఈ ప్రయాణం సులభం కాదు. సిద్ధాంత విభేదాలు, అనుకూల మిత్రుల మధ్య ఊగిసలాట, సొంత బలం పెంచుకోవాల్సిన అవసరం... ఇవన్నీ ఈ ఐక్యతకు నిరంతర సవాళ్లు. స్వతంత్రతను కాపాడుకునే పేరిట ఎవరి కుంపటి వాళ్లదే.




ఒకరేమో "విశాల ప్రజా సంఘాలను పోరాటంలోకి తెచ్చినప్పుడే వామ-ప్రజాస్వామ్య ఫ్రంట్ సాధ్యం", ఇంకొకరేమో ప్రత్యామ్నాయ రాజకీయం, స్వతంత్ర రాజకీయ అస్తిత్వం అంటారు.

ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తమ డాక్యుమెంటల్లో చెబుతున్నదాన్ని బట్టి ఈ ఐక్యత "ఎన్నికల కాన్సెప్ట్ కాదు". ఇది ఒక ప్రక్రియ. ప్రజలను బూర్జువా-భూస్వామ్య పార్టీల ప్రభావం నుంచి వేరు చేసి, విశాల ప్రజా ఉద్యమాలు, పోరాటాల ద్వారా వామపక్ష రాజకీయాలను బలపరచడం.

డాక్యుమెంట్లలో అలా ఉన్నా ఆచరణలో అలా జరగడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ప్రత్యేకించి ఎన్నికల్లో వివిధ బూర్జువా పార్టీలతో పొత్తు పెట్టుకునే సమయాల్లో బూర్జువా పార్టీల అజెండా మీదనే జత కడుతున్నారు తప్ప సొంత అజెండాతోనే పోవడం లేదనే విమర్శ ఉంది.

**ప్రత్యామ్నాయ రాజకీయమా...**

అలాగే రాజకీయ ప్రత్యామ్నాయం వేరు, ప్రత్యామ్నాయ రాజకీయం వేరు. ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమం కోసం కమ్యూనిస్టులు కృషి చేయాలంటే ఏకీకృత నినాదాలు ఉండాలని (బ్యాంకుల జాతీయకరణ, మోదీ అచ్చేదిన్ లాంటివి) సీపీఐ సీనియర్ నాయకుడు అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులు వస్తేనే ప్రజల జీవితాలు బాగుపడతాయనే భావన ప్రజల్లో బలపడాలంటే మనం పొత్తుపెట్టుకునే పార్టీల అజెండాలో కమ్యూనిస్టుల నినాదం ఒకటో రెండో అనివార్యమని, అందుకు సొంత అజెండా ఉండాలని, ఎదుటి వారి అజెండాతో పోతే ప్రజలు కమ్యూనిస్టులను కూడా అదే గాటన కట్టివేస్తారని చెప్పారు ఆయన. జాతీయ పార్టీలకు జాతీయ అజెండా ప్రధానం కావాలే గాని ప్రజాసంఘాల మాదిరి వేర్వేరుగా ఉండకూడదన్న అభిప్రాయమూ ఉంది. కమ్యూనిస్టుల ప్రత్యేకత లేకపోబట్టే వామపక్ష పార్టీలు ఏ ఉదారవాద బూర్జువా పార్టీతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ బలపడిందే తప్ప వీళ్లు కాదనే వాదనా ఉంది. 1980వ దశకం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రత్యక్ష అనుభవం ఇది. పొత్తు పెట్టుకోవడమంటే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను ఇతర పార్టీలకు అప్పగించడమనే జనాంతిక అర్థం వచ్చింది..




**కిందిస్థాయిలో ఏం జరుగుతోంది?**

కానీ ఈ ఐక్యత గ్రాస్‌రూట్ నుంచి నిర్మితమవుతుందా? సీపీఐలో సుదీర్ఘకాలం పని చేసిన ఓ సీనియర్ నేత అభిప్రాయం ప్రకారం "కమ్యూనిస్టు పార్టీ నాయకులు గ్రామాలకు దూరమయ్యారు. పార్టీలకు రాజకీయ దృష్టి కరవైంది. కలిసి పోటీ చేసినా ఫలితం లేని పరిస్థితిని గత ఎన్నికల్లో ఆంధ్రాలో చూశాం. ప్రజలు దూరమయ్యారు. జనాన్ని వాళ్ల సమస్యలపై పోగేయాలే తప్ప మనమేదో నిర్ణయించుకుని ఉపన్యాసం చెప్తామంటే వినే రోజులు కావివి. కార్యక్రమం ముఖ్యం, ప్రచారం ప్రధానం, ప్రజాసమస్యలు పరిష్కారం కావడం అన్నింటికన్నా ముఖ్యం. గ్రామాలకు వెళ్లి మాట్లాడేవాళ్లు కావాలిప్పుడు. ప్రజా నాడిని పట్టుకునే వారే ఇప్పుడు జనానికి అవసరం. జనం ఇవాళ మీ దగ్గరకు వస్తే నాకేం వస్తుందని జనం అడుగుతున్నారు. దానికి జవాబు చెప్పగలిగిన స్థితిలో కమ్యూనిస్టులు లేరు. అందువల్ల నాయకులు క్రెడిబులిటీ పెంచుకోవాలి. అప్పుడే పుంజుకోగలుగుతారు. ఈ తరహా ఫ్రంటులను ఆదరించగలుగుతారు.."

**వందేళ్లు...**
**పోరాటం...**
**త్యాగం...**
**ఆలోచన...**


అంటే సరిపోదు. కాలప్రవాహంలో కొడవలి పదునెక్కాలంటే రేపటి చరిత్రే సమాధానం కావాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అనేది నినాదం కాకూడదు.. అదో సుదీర్ఘ ప్రయాణం. ఎన్నికలకంటే ఎక్కువది. ప్రజా పోరాటాలతో సాధించేది.

"కొన్ని రోజులు భారంగా అనిపించవచ్చు, అంత మాత్రాన మీరు ఆగిపోవాలని అర్థం కాదు. పురోగతి నెమ్మదిగా ఉన్నా, అది పురోగతే అవుతుంది. ఓటమి గెలుపునకు పునాది. జీవితాల్ని ఫణంగా పెట్టి కమ్యూనిస్టు పార్టీలను కాపాడుతున్న లక్షలాది మంది కార్యకర్తలు, నాయకులు, పార్టీ హోల్ టైమర్లు ఈ లక్ష్యాన్ని వదులుతారని నేననుకోను.

ప్రముఖ మార్క్సిస్ట్ సిద్ధాంతవేత్త అనిల్ రాజిమ్వాలే చెప్పినట్టు - "కమ్యూనిస్టులు మారుతున్న కాలానికి తగ్గట్టుగా మారి" జనంలో నిలబడతారు, కొట్లాడతారు. ఆ స్ఫూర్తికి ఈ వందేళ్ల ఉత్సవం సాయపడుతుందని ఆకాంక్ష.



- ఆకుల అమరయ్య,
సీనియర్ పాత్రికేయుడు





# అండర్ 19లో టీమ్ఇండియా థ్రిల్లింగ్ విక్టరీ



**విశ్వంభర, స్పోర్ట్స్ :** అండర్ 19 ప్రపంచకప్ 2026లో భారత్ జోరు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌తో శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆయుష్ మాత్రే సారథ్యంలోని కుర్రాళ్ల జట్టు డీఎల్ఎస్ పద్ధతిన 18 పరుగుల తేడాతో గెలుపొందింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను ముందుగా 49 ఓవర్లకు ఆ తర్వాత 29 ఓవర్లకు కుదించి ఆడించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ సూర్యవంశీ(67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 72), అభిజ్ఞాన్ కుందు(112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 80) హాఫ్ సెంచరీలతో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో అల్ ఫర్హాద్(5/38) ఐదు వికెట్లు తీయగా..ఇక్బాల్ హొస్సేన్, అజిజుల్ హకీమ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ పర్వేజ్ జిబాన్ తలో వికెట్ తీసారు.

అనంతరం బంగ్లాదేశ్ 28.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అజిజుల్ హకీమ్(72 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. రిఫత్ బెగ్(37 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 37) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో ఖిలాన్ పటేల్(2/35) రెండు వికెట్లు తీయగా.. విహాన్ మల్హోత్రా(4/14) నాలుగు వికెట్లు పడగొట్టాడు. దీపేష్ దేవంద్రన్, హెనిల్ పటేల్, కన్షిక్ చౌహాన్ తలో వికెట్ తీసారు.

239 పరుగుల లక్ష్య ఛేదనలో ఓ దశలో బంగ్లాదేశ్ 90/2తో పటిష్టంగా కనిపించింది. కానీ వర్షం అంతరాయంతో సీన్ మొత్తం మారిపోయింది. వర్షం కారణంగా 90 నిమిషాల పాటు ఆటకు అంతరాయం కలిగింది. దాంతో అంపైర్లు ఓవర్లను కుదించి టార్గెట్ మార్చారు. దాంతో 29 ఓవర్లలో బంగ్లా విజయానికి 165 పరుగులు అవసరమయ్యాయి. కానీ విహాన్ మల్హోత్రా నిప్పులు చెరగడంతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ పేకమేడల్లా కుప్పకూలింది.

కలామ్ సిద్దిఖీ(15)ని ఔట్ చేసిన మల్హోత్రా మూడో వికెట్‌కు నమోదైన 44 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత బంగ్లాదేశ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ విజయానికి 12 బంతుల్లో 22 పరుగులు అవసరమయ్యాయి. విహాన్ మల్హోత్ర ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. హెనిల్ పటేల్ ఆఖరి వికెట్‌ను ఖాతాలో వేసుకోవడంతో బంగ్లాదేశ్ కథ ముగిసింది.

ఇదిలా ఉండగా, బంగ్లా పేస్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఐపీఎల్ నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేసిన కోల్‌కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్‌లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్‌లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



## మూడో వన్డేలో రోహిత్ సెంచరీ చేయాలి

### - ఆకాశ్ చోప్రా

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ప్రస్తుతం సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతున్నాడు. అయితే ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ముగిసినా రోహిత్ నుంచి భారీ ఇన్నింగ్స్ రాలేదు. తొలి వన్డేలో 26 పరుగులు చేసి ఔటైన రోహిత్, రెండో మ్యాచ్‌లో 24 రన్స్‌కు పెవిలియన్ చేరాడు. దీంతో మూడో మ్యాచ్‌లోనైనా రోహిత్ భారీ ఇన్నింగ్స్ ఆడాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సిరీస్‌ను రోహిత్ సెంచరీతో ముగించాలని అన్నారు.

భారత్ న్యూజిలాండ్ జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే ఇండోర్ వేదికగా ఆదివారం (జనవరి 18న) జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరుజట్లు ఇప్పటికే ఇండోర్ నగరానికి చేరుకొని, నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే ఈ సిరీస్‌లో వరుసగా రెండుసార్లు విఫలమైన హిట్‌మ్యాన్ మూడో వన్డేలో శతకం బాదాలని ఆకాశ్ చోప్రా ఆశించాడు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానెల్‌లో తాజాగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ఈ మ్యాచ్‌కు వేదిక కానున్న ఇండోర్ మైదానం చాలా చిన్నది. అలాగే ఈ స్టేడియంలోని పిచ్ ఫ్లాట్‌గా ఉంటుంది. అది బ్యాటర్లకు సహకరిస్తుంది. అందుకే ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ సెంచరీతో రాణించాలని ఆశిస్తున్నాను. ఎందుకంటే భారత్‌కు మరో ఆరు నెలల వరకు వన్డే మ్యాచ్‌లు లేవు. అందుకే ఈ మ్యాచ్‌లోనే రోహిత్ సెంచరీ సాధించి, సిరీస్‌ను గ్రాండ్‌గా ముగించాలని భావిస్తున్నా' అని ఆకాశ్ చోప్రా అన్నారు.

ఆరు నెలల దాకా నో మ్యాచ్!

అయితే ఈ సిరీస్ తర్వాత స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆరు నెలలపాటు ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కనిపించరు. మళ్లీ ఈ ఇద్దరూ టీమ్ఇండియా జెర్సీలో బరిలోకి దిగేది జులై నెలలోనే. జులైలో ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా వన్డే సిరీస్ ఆడనుంది. అప్పటిదాకా రో కో అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడరు. ఈ మధ్యలో మార్చి మే నెలలో ఐపీఎల్‌లో మాత్రం ఆడతారు. ఇందులో రోహిత్ ముంబయికి ప్రాతినిధ్యం వహించనుండగా, కోహ్లీ ఆర్సీబీకి ఆడతారు.

'ఈ మ్యాచ్ తర్వాత రోకో మళ్లీ ఆరు నెలల దాకా అంతర్జాతీయ మ్యాచ్ ఆడరు. అందుకే భారీ ఇన్నింగ్స్‌లో వాళ్లు మంచి జ్ఞాపకాలు ఇవ్వాలని కోరుకుందాం. ఎవరికి మంచి ప్రారంభం లభించినా, వాళ్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడాలి' అని ఆకాశ్ చోప్రా అన్నారు.

## మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న విరాట్



**విశ్వంభర, ఉజ్జయిని :** ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు పూర్తికాగా ఇరు జట్లు చెరొక మ్యాచ్‌ను గెలుచుకున్నాయి. సిరీస్‌లో చివరి (మూడో) మ్యాచ్ ఇండోర్ వేదికగా ఆదివారం మధ్యాహ్నం ప్రారంభం కానుంది. చివరి మ్యాచ్‌కోసం భారత క్రికెటర్లు ఇండోర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పలువురు క్రికెటర్లు ఉజ్జయినిలోని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం తెల్లవారు జామున 4గంటల సమయంలో భస్మ హారతి పూజలో క్రికెటర్లు పాల్గొన్నారు. మహాశివుడి దర్శనం చేసుకున్నారు. వీరితోపాటు టీమిండియా ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కూడా ఉన్నారు.

మహాకాళేశ్వరుడి సన్నిధానానికి చేరుకున్న క్రికెటర్లుకు పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పసుపు తిలకం దిద్దారు. సుమారు రెండు గంటలకుపైగా కోహ్లీ, కుల్దీప్ భస్మ హారతిలో పాల్గొన్నారు. టీమిండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్, వికెట్ కీపర్ అండ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా మహాకాళేశ్వరుడి ఆశీస్సులు తీసుకున్నారు. జై శ్రీమహాకాల్ అంటూ విరాట్ కోహ్లీ అన్నారు. మహాకాల్ ఆలయానికి రావడం సంతోషాన్ని ఇచ్చిందని కుల్దీప్ చెప్పారు. టీ20 వరల్డ్ కప్‌లో రాణించే విధంగా ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపాడు.

## చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ఇండియా నయా సంచలనం వైభవ్ సూర్యవంశీ అరుదైన ఘనత సాధించాడు. అండర్19 ప్రపంచకప్‌లో 50 ప్లస్ స్కోరు చేసిన అతి పిన్న వయస్కుడైన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. అండర్19 ప్రపంచకప్‌లో భాగంగా శనివారం భారత్, బంగ్లాదేశ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సూర్య వంశీ కేవలం 30 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇక మొత్తంగా 67 బంతులు ఎదుర్కొన్ని 6 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 72 పరుగులు సాధించాడు. గతంలో ఈ రికార్డు ఆఫ్ఘానిస్తాన్‌కు చెందిన షాహిదుల్లా కమల్ పేరిట ఉంది. అతడు 15 ఏళ్ల 19 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేయగా సూర్య వంశీ 14 ఏళ్ల 296 రోజుల వయసులోనే ఈఘనత సాధించాడు. ఇక పాకిస్తాన్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజామ్ 2010లో వెస్టిండీస్‌పై హాఫ్ సెంచరీ చేసి ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

పురుషుల అండర్ 19 ప్రపంచకప్‌లో 50 ప్లస్ స్కోర్ చేసిన అతి పిన్న వయస్కులైన బ్యాటర్లు వీరే..

* వైభవ్ సూర్యవంశీ (భారత్) - 14 ఏళ్ల 296 రోజులు - 2026లో బంగ్లాదేశ్ పై
* షాహిదుల్లా కమల్ (ఆఫ్ఘానిస్తాన్) 15 ఏళ్ల 19 రోజులు - 2014లో వెస్టిండీస్ పై
* బాబర్ ఆజామ్ (పాకిస్తాన్) - 15 ఏళ్ల 92 రోజులు - 2010లో వెస్టిండీస్ పై
* పర్వేజ్ మాలిక్జాయ్ (ఆఫ్ఘానిస్తాన్) - 15 ఏళ్ల 125 రోజులు - 2016లో ఫిజీ పై
* శరద్ వెసావ్కర్ (నేపాల్) - 15 ఏళ్ల 132 రోజులు - 2004లో ఇంగ్లాండ్ పై

## రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్



**విశ్వంభర, బిజినెస్ :** భారతీయ రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. రైల్ వన్ యాప్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ లేని టికెట్లు బుక్ చేస్తే 3 శాతం వరకు తగ్గింపు అందించనున్నట్లు ప్రకటించింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశం. ఇంతకుముందు రైల్ వన్ యాప్ వాలెట్ ద్వారా చెల్లింపు చేస్తేనే 3 శాతం డిస్కౌంట్ ఉండేది. ఇప్పుడు ఆ నిబంధనలో మార్పు చేసింది. ఇకపై యూపీఐ, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ వంటి ఏ డిజిటల్ పేమెంట్ విధానం ఉపయోగించినా ఈ డిస్కౌంట్ వర్తిస్తుంది. ఈ ప్రత్యేక రాయితీ 2026 జనవరి 14 నుంచి జూలై 14 వరకు అమల్లో ఉంటుంది. ఈ కాలంలో ప్రయాణికులు రైల్ వన్ యాప్ వాలెట్ ఉపయోగించినా, ఇతర డిజిటల్ పేమెంట్లు ఉపయోగించినా 3 శాతం తగ్గింపు పొందవచ్చు. ఈ ఆఫర్ కేవలం రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసే ముందస్తు రిజర్వేషన్ లేని రైలు టికెట్లకే వర్తిస్తుంది. ఇతర యాప్‌లు లేదా వెబ్‌సైట్ల ద్వారా బుక్ చేసిన టికెట్లకు ఈ డిస్కౌంట్ వర్తించదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. డిస్కౌంట్ వల్ల టికెట్ ధరలో కొంత మేర తగ్గింపు లభిస్తుంది. తరచుగా రైలు ప్రయాణం చేసే వారికి ఇది ఖర్చు తగ్గించే అవకాశం. డిజిటల్ చెల్లింపులు పెరగడంతో క్యాష్ అవసరం కూడా తగ్గుతుంది.

## చిన్నస్వామిలో ఐపీఎల్‌మ్యాచ్‌లకు లైన్ క్లియర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్‌కు కిక్కిచ్చే న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డుకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ మేరకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (KSCA) శనివారం ప్రకటించింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగానే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది.

'ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం' అని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో 2026 ఐపీఎల్‌లో ఆర్సీబీ హోం గ్రౌండ్ మ్యాచ్‌లు చిన్నస్వామిలోనే నిర్వహించనున్నారు. ఈ వార్తతో ఆర్సీబీ ఫ్యాన్స్‌లో జోష్ నిండినట్లైంది.

కాగా, 2025 ఐపీఎల్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంతో జూన్ 04న చిన్నస్వామి స్టేడియంలో సక్సెస్ సంబరాలు నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ఊహించిన దానికంటే అధికంగా అభిమానులు రావడంతో స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. దీంతో ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది.

చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని ఈ కమిషన్ తేల్చింది. దీంతో ఆ తర్వాత ఈ స్టేడియంలో నిర్వహించేందుకు షెడ్యూల్ చేసిన అన్ని మ్యాచ్‌లను షిఫ్ట్ చేశారు. తర్వాత కర్ణాటక డొమెస్టిక్ మహారాజా ట్రోఫీని కూడా ఆగస్టులో మైసూరుకు తరలించారు. ఆ తర్వాత మహిళల వన్డే వరల్డ్ కప్‌లోనూ చిన్నస్వామిలో కొన్ని మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, వాటిని వేరే వేదికలకు మార్చారు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలోని మ్యాచ్‌లు కూడా ఇక్కడ జరగాల్సి ఉండగా, అనుమతి లేకపోవడంతో ఆ మ్యాచ్‌లను బీసీసీఐ ఎక్సలెన్స్‌కు తరలించారు. అయితే ఇప్పుడు కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఫ్యాన్స్‌కు కచ్చితంగా ఆనందాన్ని ఇస్తుంది. కాగా, 2026 ఐపీఎల్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది.

## బంగ్లాదేశ్‌తో యువ భారత్ 'నో షేక్‌హ్యాండ్'



**విశ్వంభర, స్పోర్ట్స్ :** అండర్ 19 వరల్డ్ కప్‌లో భాగంగా బులవాయో వేదికగా భారత్ బంగ్లాదేశ్ యువ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్‌కు దిగింది. అయితే అంతకుముందు మైదానంలో అసక్తికర సంఘటన జరిగింది. టాస్ సమయంలో భారత్ కెప్టెన్ ఆయుశ్ మాత్రే, బంగ్లాదేశ్ సారథికి షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు! ప్రస్తుతం క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

నో షేక్‌హ్యాండ్

ప్రస్తుతం భారత్ బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశంలో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ఈ కాంట్రవర్సీ క్రికెట్‌దాకా వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో తాజా మ్యాచ్‌లో టాస్ సమయంలో బంగ్లా కెప్టెన్ జవేద్ అబ్రార్‌తో టీమ్ఇండియా కెప్టెన్ ఆయుశ్ మాత్రే షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. దీంతో ఇది క్రీడా వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే దీనిపై అటు బంగ్లాగానీ, భారత్‌గానీ అధికారికంగా స్పందించలేదు.

ఇదే కారణం!

బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశ పేస్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఐపీఎల్ నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేసిన కోల్‌కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్‌లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్‌లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అప్పుడు పాకిస్థాన్‌తో!

గతే దాది పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా ఆసియా కప్‌లో భారత సీనియర్ క్రికెటర్లు పాకిస్థాన్‌తో కరచాలనం చేయలేదు. ఆ టోర్నీలో పాక్‌తో మూడుసార్లు భారత్ తలపడగా, మూడుసార్లు కూడా మన ప్లేయర్లు దాయాది జట్టు ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. ఫైనల్‌లో నెగ్గిన తర్వాత కూడా పాకిస్థాన్‌కు చెందిన మోసిన్ నఖ్వీ చేతిలమీదుగా ట్రోఫీని అందుకునేందుకు టీమ్ఇండియా నిరాకరించింది. దీంతో నఖ్వీ ఈ ట్రోఫీని తనతోపాటు తీసుకెళ్లాడు. ఆ ట్రోఫీ ఇంకా భారత్‌కు అందలేదు. ప్రస్తుతం దీనిపై కూడా కాంట్రవర్సీ నడుస్తోంది.

## చిత్తుగా ఓడిన ముంబై ఇండియన్స్!



**విశ్వంభర, స్పోర్ట్స్ :** వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు మరో ఘోర పరాజయం ఎదురైంది. యూపీ వారియర్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. యూపీ కెప్టెన్ మెగ్‌లాన్నింగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై పతనాన్ని శాసించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. మెగ్ లాన్నింగ్(45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70), ఫోబే లిట్చ్‌ఫీల్డ్(37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో నాట్ సివర్ బ్రంట్ రెండు వికెట్లు తీయగా.. అమెలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టింది. నికోలా కేరీ, హీలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసారు.

అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసి ఓటమిపాలైంది. అమెలియా కేర్(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్(24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లో శిఖా పాండే(2/30) రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, సోఫీ ఎక్లేస్టోన్, దీప్తి శర్మ, చోలే ట్రయాన్ తలో వికెట్ తీసారు.

లక్ష్యచేధనలో ముంబై బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు హీలీ మాథ్యూస్(13), సజీవన్ సజన(10) నిరాశపర్చారు. దాంతో ముంబై పవర్ ప్లేలో 2 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఆ వెంటనే నాట్ సివర్ బ్రంట్‌ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. నికోలా కేరిని దీప్తి శర్మ ఔట్ చేయగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(18) ట్రయన్ వెనక్కి పంపింది. దాంతో ముంబై 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో అమెలియా కేర్, అమన్‌జోత్ కౌర్ పోరాడారు. కానీ ఛేజింగ్ రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ముంబైకి ఇది మూడో పరాజయం. రెండు సార్లు యూపీ వారియర్స్ చేతిలోనే ఓడటం గమనార్హం.

## బెంజ్ నుంచి నయా కార్లు

**విశ్వంభర, బిజినెస్ :** మెర్సిడెజ్ బెంజ్.. దేశీయ మార్కెట్లో మరింత పట్టు సాధించడానికి పావులు కదుపుతున్నది. నూతన సంవత్సరంలో సరాసరిగా మరో 12 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. మరోవైపు, ప్రాంతీయంగా తయారైన అల్ట్రా లగ్జరీ ఎస్‌యూవీ జీఎల్ఎస్ మేబ్యాక్‌ను భారత్‌లో తయారు చేసి బుధవారం విడుదల చేసింది. దీంతో ఈ కారు ధర భారీగా తగ్గింది. ప్రస్తుతం ఈ కారు ధర రూ.3.17 కోట్ల స్థాయిలో ఉండగా, భవిష్యత్తులో దీని ధర రూ.2.75 కోట్లకు దిగి రానున్నది. కరెన్సీ హెచ్చుతగ్గుదల కారణంగా వాహన ధరలు పెరగడంతో ఈసారి లగ్జరీ కార్ల విక్రయాల్లో వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితంకానున్నదన్నారు. మరోవైపు, ఈక్యూస్ ఎస్‌యూవీ సెలెబ్రేషన్ ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.1.34 కోట్లు, గరిష్ఠ ధర రూ.1.48 కోట్లు(7 సీట్లు)గా ధరను నిర్ణయించింది. యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం చెందడం, ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి ధరలను పెంచబోతున్నట్టు ఆయన ప్రకటించారు.

# పీఎఫ్ ఇక నేరుగా యూపీఐ నుంచే విత్ డ్రా




**విశ్వంభర, బిజినెస్ :** ప్రావిడెంట్ ఫండ్ (PF) ఏదైనా అవసరం వచ్చినప్పుడు.. విత్ డ్రా చేయాలంటే ఫారాలు నింపాలి. అప్రూవల్స్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు. అయితే ఈ పరిస్థితికి త్వరలోనే చెక్ పడనుంది. కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోగా, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఏప్రిల్ నెల నుంచి అందుబాటులోకి వచ్చే కొత్త విధానంతో మీ డబ్బును క్షణాల్లో విత్ డ్రా చేసుకోవచ్చు.

యూపీఐ ఆధారిత విత్‌డ్రా వ్యవస్థను అమల్లోకి తీసుకురావడానికి ఈపీఎఫ్ఓ సన్నాహాలు చేస్తోంది. ఈ కొత్త విధానం ఏప్రిల్ నెల నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం అమలైతే దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది ఈపీఎఫ్ఓ సభ్యులకు భారీ ఊరట లభించనుంది. ఇకపై పీఎఫ్ డబ్బు కోసం ఫారాలు నింపడం, రోజులు తరబడి ఎదురు చూడడం అవసరం లేకుండా, మొబైల్‌లో ఉన్న యూపీఐ యాప్ ద్వారానే డబ్బు తీసుకునే అవకాశం ఉంటుంది. సభ్యులు తమ ఈపీఎఫ్ ఖాతాలో ఉన్న బ్యాలెన్స్‌ను మొబైల్‌లోనే చూసుకుని, అవసరమైన మొత్తాన్ని ఎంచుకుని, యూపీఐ పిన్ ద్వారా విత్‌డ్రాను నిర్ధారిస్తే చాలు. డబ్బు నేరుగా బ్యాంక్ ఖాతాలోకి జమ కానుంది.

ప్రస్తుత విధానం పెద్దగా ఉపయోగం లేదు.. ప్రస్తుతం ఆన్‌లైన్ క్లెయిమ్ విధానం ఉన్నప్పటికీ, వైద్య ఖర్చులు, విద్య, పెళ్లి లేదా అత్యవసర పరిస్థితుల్లో డబ్బు వెంటనే అవసరమైన వారికి ఇది పెద్దగా ఉపయోగపడడం లేదు. ఈ నేపథ్యంలోనే ఈపీఎఫ్ఓ ఈ డిజిటల్ మార్పుకు అడుగులు వేస్తోంది. కొత్త విధానంతో పీఎఫ్ డబ్బు తీసుకోవడం ఏటీఎం లావాదేవీల మాదిరిగానే సులభంగా మారనుంది.

పూర్తిగా విత్‌డ్రా చేసుకునే అవకాశం

ఇప్పటికే ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ కొన్ని కీలక మార్గదర్శకాలకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. అర్హత ఉన్న సభ్యులు తమ ఈపీఎఫ్ ఖాతాలోని మొత్తం బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉండగా, రిటైర్మెంట్ భద్రత దృష్ట్యా కొంత మొత్తాన్ని ఖాతాలో ఉంచే నిబంధన ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

బ్యాంకుల సహకారంతో ఈపీఎఫ్ఓకు స్వంత బ్యాంకింగ్ లైసెన్స్ లేకపోవడంతో, ఈ యూపీఐ విత్‌డ్రా వ్యవస్థను బ్యాంకుల సహకారంతో అమలు చేయనున్నారు. భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, మోసాలకు అవకాశం లేకుండా సురక్షిత డిజిటల్ లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే, యూపీఐ ద్వారా ఈపీఎఫ్ విత్‌డ్రా వ్యవస్థ అమల్లోకి వస్తే ఉద్యోగుల జీవితాల్లో ఇది ఒక కీలక మార్పుగా నిలవనుంది. డబ్బు అవసరమైన సమయంలో వెంటనే అందుబాటులోకి రావడం ద్వారా ఆర్థిక ఒత్తిడి తగ్గడమే కాకుండా, డిజిటల్ ఇండియా లక్ష్యాలకు ఇది మరో బలమైన అడుగుగా మారనుంది.

ప్రజా విశ్వంభర

# పాన్ ఇండియా చిత్రం 'ఎల్లమ్మ'




అద్భుతమైన కథలని ఎన్నుకునే విజనరీ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, బలగం ఫేమ్ డైరెక్టర్ వేణు యెల్దండి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం' ఎల్లమ్మ'ను రూపొందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న తొలి చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన వేణు పవర్ ఫుల్, ఆధ్యాత్మికతతో నిండిన కథని సిద్ధం చేశారు. ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లతో దశాబ్దాలుగా సంగీత ప్రపంచాన్ని ఏలిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ కెమెరా ముందు అడుగుపెడుతున్నాడు. ఈ చిత్రంతో హీరోగా అరంగేట్రం చేయడం ఎక్సయిట్మెంట్ ని మరోస్థాయికి తీసుకెళ్ళింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ అరంగేట్రానికి ఆయన ఎంచుకున్న సబ్జెక్ట్ ఆయన ఎనర్జీ, క్రియేటివ్ పర్సనాలిటీకి పర్ఫెక్ట్ యాప్ట్. ఇందులో హీరోగా నటించడమే కాకుండా చిత్రానికి సంగీతాన్ని కూడా దేవిశ్రీనే అందిస్తున్నారు. ఎల్లమ్మ సినిమా దైవిక శక్తి నేపథ్యంగా, స్థానిక సంప్రదాయాలు, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించేలా రూపొందుతోంది. మకర సంక్రాంతి శుభ సందర్భంగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా మిస్టికల్ వరల్డ్‌కు అద్భుతంగా పరిచయం చేసింది. పొడవాటి జుట్టు, రగ్గడ్ లుక్, ఇంటెన్స్ కళ్లతో డీఎస్పీ పాత్రలో పూర్తిగా లీనమై కనిపించారు. వేప, పసుపు, కుంకుమ విజువల్స్ డివైన్ ఆరాను జోడిస్తే, దేవిశ్రీ ఇచ్చిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ కాన్సెప్ట్ గ్లింప్స్‌తోనే సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'ఎల్లమ్మ' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.



# 'పోలీసోడు' రీ ఎంట్రీ

స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంత జంటగా, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి థాను నిర్మించిన తమిళ చిత్రం 'తెరి' ఘన విజయం సాధించింది. తెలుగులో 'పోలీసోడు' పేరుతో అనువాదమై ప్రేక్షకుల హృదయాలను దోచుకుని సూపర్ హిట్ చిత్రంలా నిలిచింది. ఈ చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ 'పోలీసోడు'చిత్రం ఈ నెల 23న రీరిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు, ఆంధ్రా లో సురేష్ మూవీస్ వారు భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రీరిలీజ్ వార్తతో సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తుండగా, విజయ్ అభిమానులతో పాటు సినిమా ప్రేమికులు మరోసారి ఈ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఈ చిత్రానికి సంగీతం అందించిన జీవీ ప్రకాష్‌కుమార్ పాటలు అప్పట్లో చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ 'పోలీసోడు' విజయ్‌కు తెలుగులో కూడా బలమైన అభిమాన వర్గాన్ని మరింత పెంచింది. ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో మెరుగైన క్వాలిటీతో రీరిలీజ్ అవుతున్న ఈ చిత్రం మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్, సమంతల అభిమానులకు ఇది నిజంగా ఒక తీపి వార్త.

### డ్రగ్స్, క్రైం నేపథ్యంలో

# ఆకట్టుకోనున్న 'యుఫోరియా'

బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ రూపొందించిన లేటెస్ట్ మూవీ 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నూతన నటీనటులతో గుణ శేఖర్ నేటి యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృధ్వీరాజ్, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన టీజర్, గ్లింప్స్, ఫ్లై హై పాటకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇటీవల 'ధురంధర్' చిత్రంతో హీరోయిన్‌గా ఆకట్టుకున్న సారా అర్జున్ ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తుండటం విశేషం. సమాజంలో యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ సమస్యలు, క్రైమ్ నేపథ్యంతో చాలా రా అండ్ ఇంటెన్స్‌గా గుణశేఖర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ప్రస్తుత సమాజంలోని వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా, డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేసుకుంటున్నారనే అంశాలను ఈ చిత్రంలో చూపించబోతున్నారు.



## ధనుష్, మృణాల్ పెళ్లి పుకార్లు..!

తమిళ సినీ పరిశ్రమలో ఇప్పుడు ఎక్కడ చూసినా వెర్సటైల్ యాక్టర్ ధనుష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ పెళ్లి గురించిన వార్తలే వినిపిస్తున్నాయి. వీరిద్దరూ ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించడమే కాకుండా, పెళ్లి కూడా చేసుకోబోతున్నారని కోలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. గతంలో సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో విడాకులు తీసుకున్న ధనుష్, కొంతకాలంగా ఒంటరిగానే ఉంటున్నారు. ఈ క్రమంలో మృణాల్‌తో ఆయన పేరు ముడిపడటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

సాధారణంగా ఇలాంటి పుకార్లు వచ్చినప్పుడు సెలబ్రిటీలు వెంటనే స్పందించి ఖండిస్తుంటారు. అయితే, ధనుష్ గానీ, మృణాల్ గానీ ఈ వార్తలపై ఇప్పటివరకు పెదవి విప్పకపోవడం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి మరింత బలాన్ని చేకూరుస్తోంది. గతంలో వీరిద్దరి మధ్య ఏదో ఉందని ప్రచారం జరిగినప్పుడు తాము ఫ్రెండ్స్ మాత్రమే అన్నారు. ఇప్పుడు ఏకంగా పెళ్లి ముహూర్తం ఖరారు అయిందని ప్రచారం చేస్తున్న స్పందించడం లేదు. మృణాల్ ఠాకూర్ సీతా రామం సినిమాతో సౌత్ ఇండియాలో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నారు. మౌనం అర్థాంగీకారం అన్నట్లుగా వీరి నిశ్శబ్దం చూస్తుంటే, త్వరలోనే ఒక శుభవార్త వినే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే, కోలీవుడ్ స్టార్ హీరో మరోసారి బాలీవుడ్ భామను వివాహం చేసుకున్నట్లవుతుంది. ఇప్పటికే తమిళ ఇండస్ట్రీలో సూర్య, ఆర్య వంటి వారు ఇతర భాషల నటీమణులను వివాహం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి.

మృణాల్ ఠాకూర్ చివరిగా 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమాలో నటించింది. ఆగస్టు 2025లో ఈ మూవీ విడుదలైంది. ఆ సినిమా ప్రీమియర్‌లో మృణాల్ ఠాకూర్, ధనుష్ కలిసి కనిపించారు. అక్కడి నుంచి వారి డేటింగ్ రూమర్లు మొదలయ్యాయి. ధనుష్ తో రిలేషన్ వ్యవహారంపై ఒక సందర్భంలో స్పందించిన మృణాళ్ 'మేము కేవలం స్నేహితులం' అని చెప్పకొచ్చింది.

## వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్ #VT15..



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ #VT15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్ తో గ్రాండ్‌గా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబధించి మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ జనవరి 19న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ & కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్. సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది.

## గ్రాండ్‌గా 'రామ్ భజరంగ్' గ్లిమ్స్ విడుదల



సన్ రైజ్ ఎంటర్‌టైన్‌మెంట్, రవి ఆర్ట్స్ బయ్యర్ల పై నిర్మాతలు స్వాతిసుధీర్, డాక్టర్ రవి బాల నిర్మిస్తున్న సినిమా 'రామ్ భజరంగ్'. రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న 'రామ్ భజరంగ్' సినిమాకు సి.హెచ్. సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. స్వరబ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. 'గదర్ 2' హీరోయిన్ సిమ్రత్ కౌర్, 'బిచ్చగాడు' ఫేమ్ సట్న టీటస్, ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో రాజా రవీంద్ర, రవి శంకర్, కమల్, షఫీ, శివరామరాజు వెంకట్, ధనరాజ్, రచ్చ రవి, రాకేశ్, ఐశ్వర్య ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు అజయ్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 1980 బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ అద్భుతంగా ఉంటాయని, 2026లో ఐదు భాషల్లో (తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ) ఈ సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు, ఈ చిత్ర గ్లిమ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో జరిగింది. ఈ ఈవెంట్ లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## కొక్కొరోకో.. అంటున్న మనస్విని బాలబొమ్మల



ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ నిర్మాతగా మారి రూపొందిస్తున్న తొలి చిత్రం "కొక్కొరోకో" షూటింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. నీలాద్రి ప్రొడక్షన్ సమర్పణలో, ఆర్వీ ఫిల్మ్ హౌస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. సంప్రదాయ కోడిపందాల నేపథ్యం చుట్టూ తిరిగే కథతో, ఐదు విభిన్న పాత్రలతో రూపొందిన అంథాలజీ చిత్రంగా "కొక్కొరోకో" ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి కథ-స్క్రీన్ ప్లేను రమేష్ వర్మ అందించగా, బలమైన విజువల్స్‌తో పాటు భావోద్వేగాత్మక కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 2026లో విడుదలకు ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మరో ముఖ్య విశేషం ఏమిటంటే.. "మనస్విని బాలబొమ్మల" అనే ప్రతిభావంతమైన కళాకారిణి ఈ చిత్రంతో సినీ అరంగేట్రం చేయడం. "కొక్కొరోకో"లో ఆమె గెస్ట్ రోల్‌లో కనిపించనుంది. మనస్విని థియేటర్‌లో శిక్షణ పొందిన నటి. అంతేకాదు, ఆమె సంప్రదాయ పేర్ని నాట్యం, కర్ణాటక సంగీతంలోనూ ప్రావీణ్యం కలిగి ఉంది. చిత్రబృందం తెలిపిన ప్రకారం, కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, ఫ్రెష్ కథనాలతో, విజువల్‌గా మరియు భావోద్వేగాత్మకంగా ప్రత్యేకమైన అనుభూతిని అందించడమే "కొక్కొరోకో" లక్ష్యం అంటున్నారు.



## నిశ్శబ్దాన్ని ఆవిష్కరించనున్న 'గాంధీ టాక్స్'

స్టోరీ టెల్లింగ్‌లో శబ్దంతో నిండిన సినిమా ప్రపంచంలోకి సైలెంట్ ఫిల్మ్‌గా రూపొందిన 'గాంధీ టాక్స్' టీజర్ వచ్చేసింది. ఇది నిశ్శబ్దంగానే కాదు.. ధైర్యంగా చేసిన ఓ ప్రయత్నంగా కనిపిస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా, దృష్టిని మరల్చనీయకుండా, మాటలతో పని లేకుండారా ఎమోషన్స్‌తో, కట్టిపడేసే దృశ్యాలతో, భావోద్వేగ ప్రపంచంలోకి ఆడియెన్స్‌ను ఇది ఆహ్వానిస్తోంది. ఒక డైలాగ్ కూడా లేకుండా రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకుల మనసుల్లో అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఉద్వేగ భరితమైన నిశ్శబ్దంతో కూడిన ఈ ఇంటెన్స్ విజువల్స్ మనసుల్లో ఓ సంఘర్షణను, అశాంతి, మార్పును సూచిస్తూ.. గాంధీ నిజంగా ఏదో చెప్పబోతున్నాడనే ఆసక్తిని కలిగిస్తోంది. ఈ టీజర్ మరింత ప్రభావవంతంగా ప్రతి ఫ్రేమ్‌ను గమనించేలా, భావాలను ఫీల్ అయ్యేలా చేస్తుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ జాధవ్ వంటి టాలెంటెడ్ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించిన గాంధీ టాక్స్ టీజర్, మాటలు లేకుండానే భావాలను బలంగా వ్యక్తపరిచేలా వారి నటనలోని కొత్త కోణాలను ఆవిష్కరిస్తోంది. కిషోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఎ.ఆర్. రెహమాన్ అందించిన భావోద్వేగభరిత సంగీతం.. సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తోంది. ప్రతి నిశ్శబ్దం, ప్రతి ఘర్షణ, చెప్పని ఆలోచనలన్నింటికీ సంగీతమే భావోద్వేగ స్వరంగా మారుతుంది. జనవరి 30న 'గాంధీ టాక్స్' చిత్రం రిలీజ్ అవుతోంది.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com